జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

సంపుటి 15 సంచిక 295 విశాఖపట్నం | గురువారం 22 జూన్2023 | 8 పేజీలు | వెల : 5.00









# ఎన్నికల వేడి..

## కొత్త మలుపులు... పేలుతున్న మాటల తూటాలు

అమరావతి, : రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు జరిగేందుకు మరో ఏడాది సమయం ఉన్నప్పటికీ అన్ని రాజకీయ పార్టీలు ప్రజల మధ్యకు వచ్చి మాటలు తూటాలు పేల్చుతు న్నారు. ముందస్తు ఉందా అన్న రీతిగా ప్రతిపక్షా లు చేస్తున్న హడావిడికి సీఎం జగన్ ఆలోచనే లేదని స్పష్టమైన సంకేతాలి స్తున్నారు. ఈక్రమంలోనే నిన్న మొన్నటి వరకూ పొత్తులు పెట్టుకుని ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీలకుండా చేస్తానని చెప్పిన జనసేనాని పవన్ కల్యాన్ ఉన్నట్టుండి వారాహి యాత్రను ప్రారంభిం చి సీఎం అయ్యేందుకు తాను సిద్ధంగా ఉన్నా నంటూ హాట్ హాట్ ప్రకటనలు చేస్తున్నారు. అంతటితో ఆగకుండా ప్రభుత్వంపై విరుచుకుపడు తున్నారు. ఈక్రమంలోనే పొత్తులపై ఇప్పుడే ఏమీ చెప్పలేమని చెప్పుకొస్తు న్నారు. ఈక్రమంలోనే అధికార వైసీపీ పవన్‌కు ధీటైన కౌంటర్లు ఇస్తూ వస్తోంది. తెలుగుదేశం అధినేత చంద్రబాబుతో మైత్రీ చెడిపోవడం వల్లే పవన్ రోడ్డెక్కి అరుస్తున్నాడంటూ పవన్ వ్యాఖ్యలు అర్ధరహితమని చెబుతూ ధీటైన కౌంటర్లు చేస్తున్నారు. పవన్ చేసిన ప్రతి వ్యాఖ్యకు కౌంటర్ ఇస్తున్నారు. అసలు ఎక్కడ నుండి పోటీ చేస్తారో చెప్పకుండా తనను అసెంబ్లికి వంపాలంటూ ప్రజలను అడుగుతున్నారని ఎద్దేవా చేస్తున్నారు. ఎవరెన్ని చెప్పినా వై నాట్ 175 అనేది నిజమవుతుందని అంటున్నారు. ఇక తెలుగుదేశం కూడా తామేమీ తక్కువ కాదంటూ 175కు 175 స్థానా లు గెలవాల్సిందేనంటూ కేడర్‌ను సమాయత్తం చేస్తున్నారు. మెరుగైన సంక్షేమం అందిస్తామంటూ ప్రజలకు తెలియజెప్పేలా బస్సు యాత్ర ద్వారా రాష్ట్రాన్ని కలియ తిరుగుతున్నారు. ఈ మధ్యలో బీజేపీ కూడా తానున్నానంటూ అటు వైసీపీ, ఇటు తెదేపా మీద విమర్శ నాస్త్రాలు చేస్తూ వస్తున్నారు. ఈ మధ్యలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఓటర్ల చేర్పులు, మార్పులు, డూప్లికేట్లు తదితరాలపై ప్రత్యేక దృష్టిపెట్టి ఎన్నికల ప్రక్రియన ప్రారంభించింది. ఈనేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయాలు మరింత వేడెక్కుతున్నాయి.

**సీఎం సీట్లో కూర్చోవడానికి సిద్ధంగా ఉన్నా**

జనసేనాని పవన్ కల్యాన్ ఉన్నట్లుండి తన స్టాండ్ మార్చుకున్నారు. నిన్నమొన్నటి వరకూ పొత్తుల అంశంపై పదే పదే మాట్లాడిన ఆయన ఇప్పుడప్పుడే పొత్తులపై నిర్ణయం ఏమీ లేదని చెబుతున్నారు. తనకు అవకాశం ఇస్తే సీఎం కుర్చీలో కూర్చోవడానికి సిద్ధంగా ఉన్నానంటున్నారు. తనతోపాటు తన అభ్యర్థులను అసెంబ్లిలోకి పంపాలంటూ పదే పదే అభ్యర్థిస్తున్నారు. ఈక్రమంలోనే అవినీతి వైసీపీ అంటూ అధికారపార్టీపై విరుచుకుపడుతున్నారు. ఇప్పుడు పవన్ వ్యాఖ్యలు చూస్తే సీఎం జగన్ సింగిల్‌గా పోటీచేసే దమ్ముందా అంటూ పదేపదే ప్రశ్నించిన పరిస్థితి గుర్తుకొస్తోంది. పవన్ సీఎం జగన్ ట్రాప్‌లో పడ్డారా అన్న అనుమానం కలుగుతోంది. పవన్ వ్యాఖ్యలను చూస్తుంటే ఈసారి ఎన్నికల్లో వైసీపీ, తెలుగుదేశం, జనసేన-బీజేపీ వేర్వేరుగా పోటీచేస్తాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# ప్రతి విద్యార్థి డిగ్రీ చదవడమే లక్ష్యం

## ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ సిలబస్..




అమరావతి,:త్వరలోనే ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ సిలబస్‌ను ప్రవేశపెడతామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వెల్లడించారు. మన ప్రభుత్వ పాఠశాలల్లో చదివిఏ పేద విద్యార్థులు ప్రపంచ స్థాయిలో ఎదగడమే కాకుండా ఎగిరేలా విద్యా రంగంలో సమూల మార్పులు తీసుకువస్తున్నట్లు చెప్పారు. తాము తెస్తున్న మార్పులు కారణంగా ఈనాటి పేద విద్యార్థులు రేపటి రోజున ప్రపంచాన్నే ఏలతారన్నారు. చదవులో ఎన్నో మార్పులు వస్తున్నాయని, ఆ మార్పులకనుగుణంగా పేద విద్యార్థులకు విద్యను అందించాల్సిన అవసరం ఉందని, తద్వారానే వారు గ్లోబల్ సిటిజన్స్‌గా మారే అవకాశముందన్నారు. ఇందులో భాగంగానే త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నేషనల్ బకాలారియేట్ సిలబస్‌ను ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాల ల్లో ఇంగ్లీస్ మీడియంను, సిబిఎస్ఇ సిలబస్‌ను ప్రవేవపెట్టినట్లు చెప్పారు. మంగళవారం పది, ఇంటర్, ఉన్నత విద్యలో రాష్ట్ర స్తాయిలో ప్రధమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు సిఎం జగన్ పురస్కారాలిచ్చి సన్మానించారు. ఆ సందర్భంగా సిఎం జగన్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే విద్యలో ఎన్నో మార్పులు తెచ్చామన్నారు. బైలింగ్వల్ పాఠ్యపుస్తకాలను అందుబాటులోకి తెచ్చామని, ఎనిమిదో తరగతి నుండి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను అందిస్తున్నామని, ఇతర తరగతుల విద్యార్థులకు కూడా బైజూస్ కంటెంట్‌ను అందిస్తున్నామని చెప్పారు. మూడో తరగతి నుండే సబ్జెక్ట్ టీచర్లను ఏర్పాటు చేశామని, కరిక్యులమ్‌ను కూడా మార్చామని చెప్పారు.

## గ్రాఫ్ బాగుంటేనే టికెట్.. ఎమ్మెల్యేలకు తేల్చి చెప్పిన జగన్



అమరావతి: గ్రాఫ్ బాగుంటేనే టికెట్ ఇచ్చేదని ఎమ్మెల్యేలకు సీఎం జగన్ తేల్చి చెప్పారు. ఎమ్మెల్యేల మీటింగ్ లో ముఖ్యమంత్రి జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. పనితీరు బాగున్న ఎమ్మెల్యేలకే టికెట్లు ఇస్తానని, పనితీరు బాగోలేని వారికి సీట్లు ఇవ్వలేనని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఎమ్మెల్యే గ్రాఫ్ పెంచుకోవాలని చెప్పారు. గ్రాఫ్ బాగోలేని వారిని కొనసాగించడం కుదరదన్నారు. గడపగడపకూ కార్యక్రమం వల్ల గ్రాఫ్ పెరుగుతుందని చెప్పారు. సర్వేల్లో అనుకూలంగా లేని వారిని కూడా కొనసాగించడం కుదరదని హెచ్చరించారు. ఇలాంటి వారికి టికెట్లు ఇవ్వడం వల్ల వారికీ నష్టం, పార్టీకి నష్టమని చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్న సురక్షపై చర్చ సందర్భంగా ఆయన ఈ హెచ్చరికలు జారీ చేశారు. ఏయే పథకాలు ప్రజలకు అందలేదో తెలుసుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పట్ల సానుకూలంగా స్పందించానలి సూచించారు. వచ్చే సమావేశానికి పనితీరును మెరుగుపరుచుకుని రావాలని అన్నారు. 15 నుంచి 20 మంది ఎమ్మెల్యేల పనితీరు ఏమాత్రం బాగోలేదని వారిని పిలిచి మాట్లాడతానని చెప్పారు. అందరూ కష్టపడి 175కి 175 సీట్లను గెలుచుకుందామని చెప్పారు. జులై 1 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం మొదలవుతుందని, ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు సంపూర్ణంగా మంచి జరిగేలా చూడాలన్నారు. సోషల్ మీడియా కూడా మనకు చాలా ముఖ్యమని సీఎం వైయస్ జగన్ చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు.




## అర్బీఐ నుంచి మరో వెయ్యి కోట్ల రుణం పొందిన ఆంధ్రప్రదేశ్

అమరావతి, : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అర్బీఐ నుంచి మరో వెయ్యి కోట్ల రూపాయల రుణం పొందింది. రూ. 500 కోట్లకు 17 సంవత్సరాలకు 7.35 శాతం వడ్డీతో రుణం తీసుకురాగా, మరో రూ. 500 కోట్లు 9 సంవత్సరాలకు 7.40 శాతం వడ్డీతో అప్పు తీసుకుంది. ఈ అప్పుతో 77 రోజుల్లో 20, 500 కోట్లు తీసుకుంది. ఈ ఏడాది ఎఫ్ఆర్‌బీఎం కింద 30, 500 కోట్ల అప్పుకు ఏపీ ప్రభుత్వానికి అనుమతించింది. ఇక 10 వేల కోట్లే మిగిలి ఉన్నాయి. ఆఫ్ బడ్జెట్ బారోయింగ్స్ కోసం రాష్ట్రం ప్రయత్నాలు చేస్తోంది. కేంద్రం ఇచ్చిన 2014-15 రెవెన్యూ లోటు- 10 వేల కోట్లను ప్రభుత్వం వాడేసుకుంది.

# వ్యవస్థలు చేస్తున్న హత్యలకు బడుగులు బలి

### జగన్ పై చంద్రబాబు మండిపాటు




అమరావతి: నంద్యాలలో దళిత యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై టీడీపీ అధినేత చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో బడుగుల హత్యలు పెరిగాయని ట్విట్టర్ లో ట్విట్ చేశారు..నంద్యాలలో యువకుని ఆత్యహత్య.. వ్యవస్థ చేసిన హత్యేనని ఆరోపించారు. వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ నేరాంధ్రప్రదేశ్‌గా మారిపోయిందని చంద్రబాబు మండిపడ్డారు.. వ్యవస్థలు చేస్తున్న హత్యలకు బడుగులు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు."దొంగతనం నేరం మోపి పోలీసులు వేధించడంతో నంద్యాలలో చిన్నబాబు అనే దళిత యువకుడు ప్రాణాలు తీసుకోవడం అత్యంత బాధాకరం. ఏ పోలీసులు అయితే వేధిస్తున్నారని 2020 నవంబర్‌లో అబ్దుల్ సలాం కుటుంబం ఆత్మహత్యకు పాల్పడిందో.. అదే పోలీస్ స్టేషన్ అధికారుల వేధింపుల కారణంగా నేడు చిన్న బాబు రైలు కింద పడి ప్రాణాలు తీసుకోవడం విషాదకరం" అని పేర్కొన్నారు. రక్షణ ఇవ్వాల్సిన పోలీసుల వల్లే ప్రాణాలు పోయే పరిస్థితుల్లోకి రాష్ట్రాన్ని తీసుకువెళ్లారని చంద్రబాబు అన్నారు.. నంద్యాల ఘటనలో బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బాధ్యులపై పోలీసులు కేసు నమోదు చేయాలని కోరారు..




# విద్యా నాణ్యతా ప్రమాణాలు పెంపొందించండి..!: కృష్ణాజిల్లా డిఇఓ తాహేరా సుల్తానా



మచిలీపట్నం జూన్ 21: ప్రజాపాలన : విద్యా నాణ్యతా ప్రమాణాలు పెంపొందించి, 100% నమోదు లక్ష్యంగా పనిచేయాలని కృష్ణాజిల్లా డిఇఓ తాహేరా సుల్తానా అన్నారు. బుధవారం జిల్లా డీఈవో కార్యాలయ సమావేశ మందిరంలో, ఎంఈఓ లకు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల కు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ తాహేరా సుల్తానా ముందుగా, నూతనంగా ఎంఈఓ 2 , పోస్టులో చేరిన ప్రధానోపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ లకు పలు సూచనలు చేశారు. మండల విద్యాశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యాభివృద్ధి కొరకు సమగ్ర ప్రణాళికలను రూపొందించుకొని, అత్యంత బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. పిల్లల సమగ్ర వివరాలు పూర్తిగా తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలు అయిన జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి,తదితర పథకాల గూర్చి పూర్తిగా తెలిసి ఉండాలని, అన్నారు. 6 నుండి 18 సంవత్సరాల లోపు వయసు గల బాలబాలికలందరూ బడిలోనే ఉండేటట్లుగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా బడి బయటి పిల్లలను గుర్తించి వారి సమగ్ర సమాచారాన్ని వాలంటీర్ల ద్వారా తెలుసుకొని, బడికి గైరు హాజరు అయ్యే పిల్లలను,గుర్తించాలన్నారు. బడి మానిన పిల్లల ఇళ్లకు ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్, ప్రధానోపాధ్యాయులు, వెళ్లి వారి తల్లిదండ్రులకు విద్య యొక్క ఆవశ్యకతను తెలియజేయాలన్నారు. 100% నమోదు లక్ష్యంగా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. కాఫీ విత్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఒక రోజు ఓరియాంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజన అమలు, పరిశీలించాలన్నారు. అత్యంత నాణ్యతా ప్రమాణాలతో కూడిన మధ్యాహ్న భోజనం అందుతోందా? లేదా? అన్నది ఎంఈఓ లు వారి సందర్శనలో పరిశీలించాలన్నారు. ప్రతిరోజు ఎంఈఓ లు పాఠశాల ప్రారంభించడానికి పది హేను నిమిషాల ముందే, గ్రామాలకు చేరుకోవాలన్నారు. ఎంఈఓ లు ఆయా గ్రామాలకు చేరుకొని , వారి సందర్శనలో నమోదు చేసిన అంశాలను సమగ్ర నివేదికగా రూపొందించుకోవాలన్నా రు. వారి సందర్శనలో ఎక్కడైనా లోటుపాట్లు గమనిస్తే , జిల్లా అధికారులకు సమగ్ర నివేదికను సమర్పించాలన్నారు. ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు కూడా, వారు పని చేస్తున్న గ్రామంలోని పాఠశాల యొక్క, ప్రాథమిక సమాచారం పూర్తిగా తెలిసి ఉండాలన్నారు. అంగన్వాడి, ఒకటి రెండు తరగతులు ప్రైమరీ గాను, మూడు నుండి పదవ తరగతి వరకు హై స్కూల్స్ గాను, మూడు నుండి 12వ తరగతి వరకు హై స్కూల్ ప్లస్ గాను పరిగణింప బడుతొందన్నారు. ఒకటి నుండి 8వ తరగతి వరకు ప్రీ హై స్కూల్ గా, ఫౌండేషన్ ,శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్స్ గా రూపాంతరం చెందాయని అన్నారు. విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన భోజనం అందుతోందా?లేదా? అన్నది పరిశీలించి, ప్రధానోపాధ్యాయులకు, వంట ఏజెన్సీ వారికి సలహాలు, సూచనలు అందించాలన్నారు. ఎక్కడైనా, విద్యార్దులకు చాలీ చాలని భోజనం అందించినట్లు గమనిస్తే వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. నివేదికలను ఎలా రూపొందించాలి? వాటిని పై అధికారులకు ఎలా సమర్పించాలి? అన్న విషయాన్ని కూలంకషంగా తెలుసుకోవాలని, నూతనంగా ఎంఈఓ లుగా చేరిన వారికి సూచించారు. ఎంఈఓ లు మానిటరింగ్ సమగ్రంగా నిర్వహించాలని అన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, టీచింగ్ నోట్స్, ఉపాధ్యాయ డైరీ, వ్రాస్తున్నారో, లేదో, పరిశీలించాలన్నారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు అన్నీ సక్రమంగా నిర్వహించేలాగా చర్యలు తీసుకోవాలని తాహేరా సుల్తానా అన్నారు. జగనన్న ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం నిరంతర కృషి చేస్తోందని, నూతనంగా చేరిన ఎంఈఓ లు నిబద్ధతతో పనిచేయాలన్నారు. జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ. ఎ. శేఖర్ మాట్లాడుతూ, నాడు నేడు మొదటి దశ పూర్తయిందని, రెండవ దశలో పనులు కొన సాగుతున్నాయని, పనులు పారదర్శకంగా నిర్వహించే లాగా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు పేరెంట్ టీచర్ అసోసియేషన్ సమావేశాలు ప్రతి నెల నిర్వహించాలని అన్నారు. అలాగే వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ తో వారానికి రెండుసార్లు సమావేశాలు కూడా నిర్వహించాలన్నారు. 10 నుండి 15 సంవత్సరాలలోపు వయసు గల పిల్లలకు ఐరన్ మరియు ఫోలిక్ ఆసిడ్ టాబ్లెట్లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని, పిల్లలందరికీ అందేలాగా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే నని అన్నారు. చైల్డ్ ఇన్ఫోని, ప్రతి విద్యార్థి యొక్క వివరాలను సమగ్రంగా ఆన్లైన్ చేయాలన్నారు. వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ విద్యా కార్యక్రమాలన్నింటి లో పాలుపంచుకోవాలన్నారు. పాఠశాల దశ ,దిశ మార్చేది విద్యేనని, అలాంటి విద్యా సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరూ పొందే లాగా చూడాలన్నారు. జేవీకే కిట్స్ అందరికీ అందాయా? లేదా? అన్నది పరిశీలించాలన్నారు. బందరు ,గుడివాడ డివిజన్ల జిల్లా ఉప విద్యాశాఖాధికారి, యు .వి సుబ్బారావు నూతనంగా ఎంఈఓ లుగా చేరిన ఉపాధ్యాయులకు విద్యా ప్రణాళికలు, ప్రమాణాలు పెంపు పై, తీసుకోవలసిన జాగ్రత్తలపై సమగ్రంగా వివరించారు. ఎంఈఓ లు, అత్యంత బాధ్యతాయుతంగా పనిచేసి విద్యా శాఖకు పేరు తేవాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించేలాగా ఎంఈఓ లు పర్యవేక్షించాలన్నారు. విద్యార్థుల నోట్స్ లు పరిశీలించారో లేదో గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఏడీ.ఎం.ఏ.అజీజ్, అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఆర్ కే టి కాలనీలో రక్త చరిత్రని ఆపేదెవరు ?

**ఎస్ ఆర్ కె టి కాలనీలో వరుస అత్యలకు కారణం ఏమిటి ?**

**రౌడీ షీటర్ హత్యలకు కారణమేమిటి ?**

**వర్గ విభేదాలా.. అధిపత్యం పోరా..?**

**2016 నుండి ప్రారంభమైన హత్యలు 2023 కొనసాగుతున్నాయి**

**రేషన్ డీలర్ బుజ్జి దగ్గర నుండి బాజీ వరకు కలవర పెడుతున్న హత్యలు**

**ఎస్ ఆర్ కే టి కాలనీలో బాజీ అనే రైడ్ షీటర్ దారుణ హత్య**



పల్నాడు జిల్లా. నరసరావుపేట. జూన్ 21 (ప్రజా పాలన ప్రతినిధి. ): నరసరావుపేట శివారు కాలనీ అయిన ఎస్ ఆర్ కే టి కాలనీలో రౌడీ షీటర్ దారుణ హత్య వెలుగులోకి వచ్చింది బాజీ అనే రౌడీషీటర్ ను కొంతమంది హత్య చేసి పూడ్చివేశారు. ఈ సమాచారం అందుకున్న రూరల్ సీఐ ఎస్ఐ సంఘటన స్థలంలోకి వెళ్లి దర్యాప్తు చేస్తున్నారు గతంలో ఎస్ ఆర్ కే టి కాలనీలో పలు హత్యలు జరిగాయి ఎస్ఆర్కెటి కాలనీ అంటేనే అసాంఘిక కార్యకలాపాల కు నిలయంగా మారింది. కాలనీలో ఒకటో లైన్ నుండి పది వ లైన్ వరకు రకరకాల వ్యక్తులు వస్తు అసాంఘిక కార్యకలాపాలు చేస్తూ అక్కడున్న కాలనీవాసులను భయభ్రాంతులను గురి చేస్తున్నారు .గతంలో పోలీసు తనిఖీలు చేస్తున్న రౌడీ షీట్ల పై పోలీసుల నిఘా లేకపోవడంతో ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్నారు. 2016 సంవత్సరం నుండి ఇప్పటివరకు సుమారు ఏడుగురు హత్యకు గురయ్యారు, 2016లో తెలుగుదేశం పార్టీకి చెందిన రేషన్ డీలర్ బుజ్జి మైనార్టీ నాయకుడు ని హత్య చేశారు. తరువాత పాల వ్యాపారం చేసుకునే మాతంగి కన్నా అనే వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. తరువాత రామిరెడ్డి పేటకు చెందిన మస్తాన్ వలి ఊరఫ్ బ్రిజిలి పట్టణంలోని మార్కెట్ సెంటర్లో లాడ్జింగ్ లో హత్యకు గురయ్యాడు. తర్వాత రౌడీ షీటర్ నాగరాజును అరండల్ పేటలో దారుణంగా హత్య చేశారు. తరువాత ఎస్ కె సుభాని అతన్ని ఎస్ ఆర్ కే టి సమీపంలో హత్య చేశారు. ఇస్లాం పేటకు చెందిన అల్లా కసం సుభాని వర్గీయులు చిత్రాలయ సెంటర్లో దారుణ హత్య చేశారు .ఇప్పుడు రౌడీ షీటర్ బాజీని కళ్ళల్లో కారం కొట్టి దారుణంగా హత్య చేశారు. హత్య చేసి ఆనవాళ్లు కనపడకుండా ఎస్ఆర్కెటి కాలనీ ప్రక్కన పొలాల్లో పూడ్చిపెట్టారు. ఇలా హత్యల మీద హత్యలు జరుగుతున్న పోలీసు యంత్రాంగం వీరిపై ని గా ఎందుకు వేయటం లేదో అర్థం కావడం లేదు. ఎస్ ఆర్ కె టి లో 18 లైన్లు ఉంటే కాలనీ మొత్తం అయిదు వేల జనాభా ఉన్నారు. రెండు వేల ఓటింగ్ ఉంది కానీ అక్కడ ప్రతిరోజు గొడవలే నూతన పల్నాడు జిల్లా ముఖ్య కేంద్రమైన నరసరావుపేటలో ఇలాంటి సంఘటన జరగటం ఎస్ ఆర్ కె టి లో ఉంటున్న ప్రజల ఆందోళనకు గురవుతున్నారు ఇప్పటికైనా పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి ఎస్ ఆర్ కె టి పై నిఘా ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకొని శాంతి భద్రతలను కాపాడాలని కాలనీవాసులు కోరుచున్నారు.

## ఈ నెల 27న గోకవరంలో సుందరమ్మ సత్రం భూములు వేలం పాటలు

### ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రెండు దశాబ్దాల పోరాట ఫలితమే : కర్నాకుల

గోకవరం,ప్రజా పాలన జూన్ 21 :ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రెండు దశాబ్దాల పోరాట ఫలితంగా గోకవరం మండలం రంపయర్రంపాలెంలోని సుందరమ్మ సత్రం భూములకు ఈ నెల 27వతేదిన మండల కేంద్రమైన గోకవరంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆవరణలో తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ , దేవాదాయ ధర్మాదాయ శాఖ రాష్ట్ర, జిల్లా అధికారుల సమక్షంలో వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఎండోమెంట్ అధికారులు ప్రకటించారని ఏ.పీ. ఆర్. సి .ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా రంపయర్రంపాలెం లో ఉన్న మల్లంపల్లి సుందరమ్మ సత్రం భూములను భూ కబ్జాదారులు, అధికారులతో చేతులు కలిపి తమ కబంధహస్తాల్లో ఉంచుకొని అక్రమంగా అనుభవించారని, సుమారు 20 ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో భూమిలేని నిరుపేదలు ఆ భూముల నుండి భూ కబ్జాదారుల కథంబ హాస్యాలు నుండి బయటకు తీసుకువచ్చి బహిరంగ వేలం పాటలు నిర్వహించాలని, అనేక రూపాలలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి, ఉద్యమించామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, భూ కబ్జాదారుల నుండి పాటలో పాల్గొనే పేదలకు ఎటువంటి హాని కలగకుండా పోలీస్ బందోబస్తుతో కట్టు దిట్టమైన చర్యలు తీసుకుని వేలంపాటలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## సెయింట్ ఆన్స్ లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



చీరాల, జూన్ 21, ప్రజాపాలన : సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి లో, చీరాలలో 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను , కళాశాల జాతీయ సేవా విభాగము వారి ఆధ్వర్యములో,ఘనంగా నిర్వహించినట్లు, కళాశాల సెక్రటరి వనమా రామ కృష్ణా రావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ప్రధాన అధ్యాపకులు డాక్టర్ మొయిద వేణుగోపాలరావు లు సంయుక్తంగా తెలియజేశా రు. ఈ సందర్భముగా కళాశాల ప్రధానోధ్యాపకులు మాట్లాడుతూ, మనస్సును, బుద్ధిని సక్రమ మార్గములో ఉంచినట్లైతే ఏకాగ్రతను సాధించ వచ్చునని తద్వారా జీవితములో ఉన్నత స్థాయిని సాధించవచ్చునని తెలిపారు. విద్యా సంస్థలలో యోగాను నిర్వహించుటకు, తగిన సదుపా యాలను కల్పిస్తున్నట్లు తెలి పారు. విద్యార్థులను ఆన్ లైన్ లో యోగా కోర్సులను ప్రోత్సహిస్తూ, తగు చర్చా వేదికల ద్వారా, ప్రాచుర్యము కల్పిస్తు న్నట్లు తెలిపారు. ముఖ్య అతిథి యస్. శివ కోటేశ్వర రావు మాట్లాడుతూ, యోగ శాస్త్రము ప్రాచీన విద్య అని, దీనిని అందరూ ఆచ రించటం ద్వారా, మంచి ఆరోగ్యాన్ని పొంది,ఉన్నతంగా జీవించ వచ్చునని తెలిపారు. యోగాభ్యాసాన్ని జీవి తములో ఒక భాగము చేసుకున్న ట్లైతే, శారీరక రుగ్మతలకు దూరంగా ఉండవచ్చని,ఆత్మస్థైర్యం పెంపొందించుకోవటంతో పాటు, మానసి క ప్రశాంతతను పొందవచ్చునని తెలిపారు. విద్యార్థులకు ఉపయోగపడే వివిధ యోగాసనాలను,సూర్యనమస్కారాలను, విద్యార్థులకు ఎలా చేయాలో నేర్పి, ఆ ఆసనాలను వేయటం వలన కలిగే ప్రయోజనాలను, విద్యార్థులకు సవివరంగా తెలియజేశారు. సి.సుబ్బారావు, డైరెక్టర్(అక్రిడిటేషన్స్) మాట్లాడుతూ, ఆరో గ్యమే మహా భాగ్యము అని, దానికి యోగ సాధన ఒక మంచి మార్గమని తెలిపారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపా ల్ డాక్టర్.వి.వి.నాగేశ్వరరావు విచ్చేశారు. ఈ సందర్భముగా ముఖ్యఅతిథి యస్.శివ కోటేశ్వరరావును ఘనంగా సన్మానించి, కళాశాల ప్రధా నోధ్యాపకులు మెమొంటోను అందజేసారు. యన్.యస్.యస్ కోఆర్డినేటర్ యస్ మీరావలి, సమన్వయ కర్తగా వ్యవహరించిన, ఈ కార్యక్రమం లో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారు.

## విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించిన ఇండియన్ బ్యాంక్



గోకవరం ప్రజా పాలన జూన్ 21:మండల కేంద్రమైన గోకవరంలోని స్థానిక ఇండియన్ బ్యాంక్ యాజమాన్యం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించిన సంఘటన బుధవారం ఎంఈఓ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ఆర్ ఆనంద్ మాట్లాడుతూ బ్యాంకింగ్ మీద విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం ప్రత్యేకంగా మండల స్థాయిలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాలకు అనుగుణంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆర్బిఐ ఆదేశాల మేరకు ఈ అఖిల భారత విద్యను ప్రతి మండలంలో నిర్వహించడం జరుగుతుందన్నారు . క్విజ్ పోటీలలో కామరాజుపేట హైస్కూల్ విద్యార్థులు ప్రథమ (5000), గుమ్మళ్లదొడ్డి హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ (3000), రంపయర్రంపాలెం హైస్కూల్ విద్యార్థులు తృతీయ (2000) స్థానంలో విజేతలుగా నిలిచారని , విద్యార్థులకు నగదును వారి యొక్క బ్యాంక్ అకౌంట్లో జమ చేయడం జరుగుతుందన్నారు. అలాగే విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఆర్బిఐ సర్టిఫికెట్ కూడా ఇవ్వడం జరుగుతుందని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ఆర్ ఆనంద్ తెలిపారు. క్విజ్ పోటీలలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థికి ఈనెల 28న నిర్వహించే జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే క్విజ్ పోటీలలో పాల్గొనే అవకాశం కల్పిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గౌరమ్మ , తిమ్మరాజు దొర, యు లలితా దేవి, జి ఆంజనేయులు, కే పాపన్న దొర, పి సారధి, సూరిబాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ చీరాల ఇంచార్జ్ మన వెంకటేష్ సూపర్..



చీరాల, జూన్ 21, ప్రజాపాలన : చీరాల నియోజకవర్గ వ్యాప్తంగా, పార్టీ కార్యక్రమాలలో కానీ, ప్రజలతో మమేకమై, వారికి చేరువ కావడంలో కానీ, మనోడు.., సూపర్..,అని వైసిపి చీరాల ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబును, రాజ్యసభ సభ్యులు రీజనల్ కోఆర్డినేటర్ బీద మస్తాన్ రావు అభినందిస్తూ, వెంకటేష్ పనితీరుపై ప్రశంసల జల్లు కురిపించారు. సీఎం క్యాంపు కార్యాలయంలో, జగనన్న సురక్ష, గడపగడపకూ మన ప్రభుత్వంపై,నిర్వహించిన సమీక్ష సమావేశంలోను, చీరాల నియోజకవర్గంలో వైఎస్సార్ సిపి బలోపేతానికి, పార్టీ కార్యక్రమాలను అత్య ద్భు తంగా నిర్వహిస్తూ, మెరుగైన పనితీరు ప్రదర్శించారని, సీఎం జగన్ సైతం, చీరాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కరణం వెంకటేష్ ను అభినందించారు. పలువురు వైసిపి నేతలు సైతం వెంకటేష్ పై ప్రశంసల జల్లు కురిపించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు రీజనల్ కో-ఆర్డినేటర్ బీద మస్తాన్ రావు,కనిగిరి ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ రావు,రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నాళ్ళ వెంగళరావు, వైజాగ్ ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్, బీసీనాయకులు మధు, అర్బన్ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు,నియోజకవర్గ వైసీపీనాయకులు పాల్గొన్నారు.

## విగ్రహా విష్కరణ ఘనంగా నిర్వహించడమే లక్ష్యం: వైసీపీ ఇంచార్జ్ కరణం వెంకటేష్




చీరాల, జూన్ 21, ప్రజాపాలన : చీరాల ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేసి, ఆర్థిక శాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్ గా పదవులను అలంకరించి, దేశవ్యాప్తంగా చీరాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చిన, రాజకీయ చాణుక్యులు స్వర్గీయ డాక్టర్ కొణిజేటి రోశయ్య విగ్రహ ఆవిష్కరణ, అత్యంత ఘనంగా నిర్వహించడమే తన లక్ష్యమని, వైఎస్ఆర్సిపి చీరాల నియోజకవర్గ ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు స్పష్టంచేశారు. చీరాల మున్సిపల్ కార్యాలయంలో స్వర్గీయ డాక్టర్. కొణిజేటి రోశయ్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం గురించి చర్చిం చుటకు, ఆర్యవైశ్య ప్రముఖులతో కలిసి, సమీక్షా సమావేశంలో, వైసీపీ చీరాల నియోజకవర్గ ఇంచార్జ్ కరణం వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా వైసీపీ ఇన్చార్జి వెంకటేష్ మాట్లాడుతూ, పార్టీలకతీతంగా ప్రజలందరి ఆదరాభిమానాలు చూరగొన్న, రోశయ్య విగ్రహావిష్కరణ కార్య క్రమంలో పాలుపంచుకునే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. భవిష్యత్తు కార్యాచరణ పై సమీక్షించి, సలహాలు, సూచ నలు అడిగి నమోదు చేసుకున్నారు. సమావేశంలో మునిసిపల్ చైర్మన్ జంజనం.శ్రీనివాసరావు, వాణిజ్య విభాగం అధ్యక్షులు చీమకుర్తి బాలకృష్ణ, మామి డాల రాములు, గుంటూరు ప్రభాకరరావు, శిఖాకొల్లి వెంకటేశ్వర్లు,చిన్ని లీలధర్, తులాబందు సురేష్, పోలిశెట్టి వేణు, శ్రీరామ్ వేణు, గుంటూరు మాధవరావు, వలివేటి మురళి కృష్ణ, కాకరపర్తి సుబ్బారావు, అచ్చుత శ్రీనివాసరావు, బాలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
సంపాదకీయం
గురువారం 22, జూన్ 2023

# వ్యవస్థలపై ఆమెది ఒంటరిపోరాటం

వైఎస్‌వివేకానందరెడ్డిని హత్యచేసిన దోషులను బోనులో నిలబెట్టేందుకు ఆయన కూతురు సునీత న్యాయపోరాటం చేస్తున్నది. ఆమె చేస్తున్నది ఒంటరి పోరాటం. అది వ్యక్తులపై మాత్రమే కాదు.. వ్యవస్థలపై చేస్తున్న ధర్మపోరాటం. ఆమె చదివింది వైద్యశాస్త్రం. చేస్తోంది వైద్యవృత్తి. కానీ ఆమె సుప్రీంకోర్టులో తన తండ్రి హత్య కేసులో లాయరులా తన వాదనలు వినిపిస్తూ సంచలనం సృష్టించింది. ఇదో అరుదైన సంఘటన. పగ, ప్రతీకారం, అహంకారాలకు ప్రతిరూపమైన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని ఎదుర్కోవడం అంత చిన్నవిషయమేమీ కాదు. అధికారం, డబ్బు, లాబీయిస్టులు వ్యవస్థలను ప్రభావితం చేస్తున్న నేపథ్యంలో ఆమె మనోధైర్యంతో ముందుకు సాగుతోంది. సునీత లేకపోతే గొడ్డలిపోటు కాస్తా గుండెపోటుగా మారేది. అనేక నిజాలు వెలుగులోకి రావడం వెనుక ఆమె పోరాట స్ఫూర్తి దాగిఉంది.సీబీఐపై వస్తున్న ఒత్తిడి వల్ల దర్యాప్తు సజావుగా జరగడం లేదనే అనుమానం ప్రజల్లో ఉంది. దీంతో సీబీఐ, లాయర్, కూతురు మూడు పాత్రలను సునీతే పోషించింది. ఆమె అలుపెరుగని పోరాటం మహిళా లోకానికి ఆదర్శంగా నిలుస్తుంది. తన తండ్రి హంతకుల ముసుగు తొలగించేందుకు ఆమె పోరాడుతోంది. అధికార పార్టీ, దాని ప్రచార మాధ్యమాలు రోజుకొక అభూత కల్పనను, అబద్ధాలను వండివారుస్తూ ఆమెను, ఆమె భర్త నైతికస్థైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ క్రమంలో ఆమె అనేక అవమానాలు, అవరోధాలు, అభాండాలను ఎదుర్కొంటూ తాను సబల అని నిరూపించుకుంటున్నది. న్యాయస్థానంలో తనకు అనుకూలంగా కాని, ప్రతికూలంగా కాని తీర్పులు వచ్చినా ఎక్కడా అధైర్యపడకుండా, స్థితప్రజ్ఞతతో మొండిగా ముందుకు వెళ్తున్నారు. సీబీఐ కోర్టులో సునీతకు ఆమె తరపు లాయర్‌తో కలిసి వాదించే వెసులుబాటు కల్పించారు. జులై 19న సుప్రీంకోర్టులో సునీత పిటీషన్‌పై విచారణ జరిగింది. ఈ సందర్భంగా అవినాష్ రెడ్డికి, సీబీఐకి నోటీసులు జారీ చేయాలని సుప్రీం ఆదేశించింది. ఈ రెండు ఘటనలు ఆమె పోరాటానికి కొంత సత్ఫలితాలు ఇచ్చాయి. అవినాష్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు మంజూరు చేసిన ముందస్తు బెయిల్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సునీత సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా సునీత స్వయంగా సీనియర్ న్యాయవాదిలా వాదనలు వినిపిస్తూ పలు అంశాలను కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. సుప్రీంకోర్టు ముందు తన ఆవేదనను, బాధను వ్యక్తపరచి ప్రపంచానికి తెలిసేలా చేశారు. హత్య గురించి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి ముందే తెలుసనే కీలకమైన అంశాలను సునీత ధైర్యంగా సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అవినాష్ రెడ్డి ఘటనా స్థలంలో ఆధారాలు చెరిపివేయడమే కాకుండా గుండెపోటుతో చనిపోయారనే తప్పుడు కథనాలు ప్రచారం చేసినట్లుగా ఆమె తెలిపారు. సీబీఐ అధికారులపై కేసులు పెట్టడం, సాక్షులను అదేపనిగా బెదిరిస్తూ నిందితులతో కలిసి అవినాష్ రెడ్డి ప్రభావితం చేసినట్లుగా కూడా ఆమె స్పష్టం చేశారు. మొత్తం పరిణామాల నేపథ్యంలోనే అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని, జగన్‌రెడ్డి పాత్రపై కూడా విచారణ జరపాలని సునీత కోరారు.వివేకానందరెడ్డి హత్య కేసును హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ చేపట్టింది. ఈ కేసులో సుప్రీంకోర్టు జోక్యం కూడా ఉంది. ఇంతటి సంచలనాత్మకమైన కేసులో జరుగుతున్న జాప్యం, సీబీఐ విచారణ తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. వివేకా హత్య విషయం జగన్‌రెడ్డి దంపతులకు ముందే తెలుసని సునీత, సీబీఐ భావిస్తున్నారు. దీనిపై కూడా విచారణ జరపాల్సిన అవసరం ఉంది. సీబీఐ తొలుత కొంత దూకుడుగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపే ప్రయత్నం చేసింది. అంతలోనే జగన్‌రెడ్డి ప్రత్యేక హోదా, పోలవరం ముసుగులో పలుమార్లు ఢిల్లీ వెళ్లారు. ఆ తర్వాత సీబీఐ తీరుపై నీలినీడలు కమ్ముకున్నాయి.హత్యలో అవినాష్ రెడ్డి ప్రత్యక్ష పాత్ర ఉందని ఆధారాలతో సహా బయటపెట్టి అతనిని ఎనిమిదో నిందితుడిగా సీబీఐ తన ఛార్జిషీట్‌లో పేర్కొంది. ఇప్పటికే పాత్రధారులు ఎనిమిది మంది తేలారు. అసలు తేలాల్సిన కుట్రధారులు వెలుగులోకి రాలేదు. ఈ నెలాఖరుతో ఈ కేసు విచారణ ముగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కానీ జూలై 3న ఈ కేసు విచారణ జరగబోతున్న నేపథ్యంలో గడువు పొడిగించే అవకాశం ఉంది. కుట్రదారులు ఎవరో నిగ్గుతేలే సమయానికి కేసు నీరుగారుస్తారనే భయం వెంటాడుతోంది. నేరతీవ్రత కళ్లకు కనపడుతున్నప్పటికీ విచారణ ఎందుకు సక్రమంగా జరగడం లేదో రాష్ట్ర ప్రజలకు అంతుబట్టడం లేదు. అవినాష్ రెడ్డిని అరెస్ట్ చేస్తున్నట్లు తెలంగాణ హైకోర్టుకు సీబీఐ తెలిపింది. ఆ తర్వాత జరిగిన నాటకీయ పరిణామాల్లో సీబీఐ నవ్వులపాలైంది. విశ్వభారతి ఆసుపత్రి వద్ద అరెస్ట్ చేయకుండా వెనుదిరిగింది. చివరకు అరెస్ట్ చేస్తున్నట్లు హడావుడి చేసి, దానిని కాగితాలకే పరిమితం చేశారు. అవినాష్ రెడ్డి వ్యవహారంలోనే ఇన్ని దాగుడుమూతలు ఆడిన సీబీఐ.. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని ఏ మేరకు విచారిస్తారనే సందేహం కలుగుతోంది. సామాన్యులకు ఒకలా, అర్థ%--%అంగ బలం ఉన్నవారికి మరోలా వ్యవస్థలు పనిచేస్తున్నాయి. సీబీఐ సాచివేత ధోరణి వెనుక కేంద్ర పెద్దల జోక్యం ఉందనే అనుమానం కలుగుతోంది. వివేకా హత్య జరిగి నాలుగేళ్లు దాటింది. చివరకు అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకున్నప్పటికీ ఫలితం కనిపించడం లేదు. వ్యవస్థలో ఉన్న లొసుగులను అడ్డుపెట్టుకుని కేసును సాగదీస్తున్నారు. సాక్షాత్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా విశాఖ వేదికగా జగన్‌రెడ్డి పాలనపై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. కానీ అందుకు తగ్గట్లు చర్యలు లేకపోగా.. వారే జగన్‌రెడ్డిని రక్షిస్తున్నారనే అపోహలు ప్రజల్లో ఉన్నాయి. ఢిల్లీ లిక్కర్ స్కాంపై ఉన్న శ్రద్ధ ఆంధ్రా స్కాంలపై లేదు. అక్కడ అంత వేగంగా స్పందిస్తున్న సీబీఐ, ఈడీ.. ఏపీలో మౌనంగా ఉండడం వెనుక కారణాలు అంతుబట్టడం లేదు. వివేకా హత్య కేసులో సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సింది అసలు సీబీఐనే. కానీ అలా చేయలేదు. కనీసం సునీత వేసిన పిటీషన్‌లోనైనా సీబీఐ ఇంప్లీడ్ కావాలి. అలా కూడా జరగలేదు. దేశంలో అత్యున్నత ప్రమాణాలు కలిగిన సంస్థలు ప్రజల్లో విశ్వాసం కోల్పోకూడదు. కేంద్రంలో అధికారంలో ఉన్నవారి చేతిలో సీబీఐ అస్త్రంగా మారకూడదు.

# యువత నైపుణ్య కొరతకు కారకులెవరు ?




కొద్దిమందికి మాత్రం అత్యంత ఆధునిక విద్య, కోట్లాది మందికి ప్రాచీనకాలం నాటి వర్ణ వ్యవస్థను బలపరచే అశాస్త్రీయ విద్యను అందించాలని బిజెపి నేతలు భావిస్తున్నారు. ఆటోమేషన్ వంటి అనేక నూతన శాస్త్రీయ పరిశోధనలు ప్రపంచాన్ని అబ్బుర పరుస్తుంటే...జ్యోతిష్యం, భూతవైద్యం అంటూ కొన్ని శతాబ్దాల నాటి విద్యా విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. యువ శ్రామికశక్తిలో 70 శాతం గ్రామీణ ప్రాంతం నుండి వస్తున్నారు. వీరికి వృత్తిశిక్షణ, ఐటిఐ, పాలిటెక్నిక్ లాంటివి అందుబాటులో వుంచి నైపుణ్యాన్ని పెంచాలి. స్కిల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, గ్లోబల్ విద్య అంటూ చేస్తున్న ఉత్తుత్తి ప్రచారం ఎన్నికల్లో కొద్దికాలం ఓట్లు రాల్చవచ్చునేమో కాని యువత భవితకు ఏ మాత్రం ఉపయోగపడదు. రాజ్యాంగం హామీ ఇచ్చిన శాస్త్రీయమైన, నైపుణ్యవంతమైన విద్యా విధానం అందరికీ కావాలి. మన దేశంలో 2030 నాటికి సుమారు 2 కోట్ల 90 లక్షల మంది యువత సరైన నైపుణ్యం లేక ఉపాధికి దూరమవుతారని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) తాజా నివేదిక పేర్కొంది. ప్రపంచ జనాభాలో భారత దేశానిది అగ్రస్థానం. కేవలం సంఖ్యలోనే కాదు, యువశక్తిలో కూడా భారత దేశానిదే ప్రథమ స్థానం. దేశ జనాభాలో 45 శాతం ప్రజలు 25 సంవత్సరాల లోపు వారే. 2025 నాటికి మన దేశ సగటు మధ్యస్థ వయసు 31 సంవత్సరాలుగా వుంటుందని అంచనా. ప్రపంచ ప్రధాన ఆర్థిక వ్యవస్థలు కలిగిన ఐదు దేశాలతో పోలిస్తే అత్యంత యువశక్తి కలిగిన దేశంగా మన దేశం వుంటుంది. అయితే ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. మరోవైపు దేశంలో నిరుద్యోగం భారీగా పెరిగిపోతున్నది. 2023 మార్చి లెక్కల ప్రకారం దేశంలో గత 45 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగ రేటు 7.76 శాతంగా వుంది. ఇది పట్టణాల్లో 8.3, గ్రామాల్లో 7.3 శాతం. చదువుకున్న వారి సంఖ్య పెరగడం వల్ల ఏర్పడిన నిరుద్యోగం కాదు. మన చదువులు సరైన నైపుణ్యత నేర్పకపోవడం వల్ల, ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల పెరుగుతున్న నిరుద్యోగం. మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందివ్వకపోతే యువత శక్తి నిర్వీర్యం అవుతుంది. మతతత్వ, విచ్ఛిన్నకర శక్తుల చేతిలో పదునైన ఆయుధంగా మారుతుంది. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన అనేక నినాదాల్లో 'నైపుణ్య భారతం' ఒకటి. 2022 నాటికి 40 కోట్ల మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చే లక్ష్యంతో 2015లో కేంద్ర ప్రభుత్వం స్కిల్ ఇండియా మిషన్ ఏర్పాటు చేసింది. ప్రారంభించిన నాడు చేసిన హంగామా తప్ప ఆచరణలో ఏ ప్రయోజనం జరగలేదు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యా నైపుణ్యం కోసం గ్లోబల్ విద్య అందిస్తామని ఇటీవలే నిపుణుల కమిటీ వేశారు. ఈ కమిటి నెల రోజుల లోపే నివేదిక ఇవ్వాలని గడువు నిర్ణయించారు. యువతలో నైపుణ్యాన్ని పెంచాలనే చిత్తశుద్ధి కంటే ఎన్నికల్లో యువత ఓట్లు కొల్లగొట్టడానికి, దేశీయ, విదేశీ కార్పొరేట్ కంపెనీల్లో పని చేయడానికి అవసరమైన కొద్దిమంది నిపుణులను తయారు చేయడానికి పాలకులు అనేక ఆకర్షణీయమైన పథకాలు ప్రకటిస్తున్నారు.

**యువ భారతం**

జనాభాలో చైనాను అధిగమించి అత్యధిక జనాభా వున్న దేశంగా అగ్రస్థానం పొందాము. దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలుపుతామని బిజెపి నేతలు ఊదరగొడుతుంటే ఈ రంగంలోనైనా అగ్రస్థానం లోకి వచ్చాములే అని నెటిజన్‌లు ఎత్తిపొడుస్తున్నారు. వాస్తవానికి ప్రపంచంలో అత్యధిక యువశక్తి వున్న దేశం మనదే. మొత్తం జనాభాలో 65 శాతం 28 సంవత్సరాల లోపు వుండగా, అందులో 25 సంవత్సరాల లోపు వున్నవారు 45 శాతం మంది వున్నారు. 2050 నాటికి కూడా మన దేశ మధ్యస్త సగటు వయసు 38 సంవత్సరాలు మాత్రమే. అప్పటికి అమెరికా సగటు మధ్య వయసు 40 నుండి 42 సంవత్సరాలు, చైనా 39 నుండి 44 సంవత్సరాలుగా వుంటుంది. రాబోయే 15-20 సంవత్సరాల మధ్య ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామిక యువ కార్మికశక్తి నాలుగు శాతం తగ్గుతుండగా, మన దేశంలో 32 శాతం పెరిగి, ప్రతి సంవత్సరం కొత్తగా ఒకటిన్నర కోటి మంది లేబర్ మార్కెట్‌లో పని చేయడానికి సిద్ధమవుతున్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే సహజ వనరులతో పాటు మానవ వనరులు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. మన దేశంలో సహజ వనరులు, సమశీతోష్ణ వాతావరణం, అన్నిటికంటే ముఖ్యంగా అతి పెద్ద సంఖ్యలో యువశక్తి వుండడం ప్రపంచ ఆర్థికశక్తిగా ఎదగడానికి గొప్ప అవకాశం. వీరికి సరైన విద్య, శిక్షణ కల్పించి నైపుణ్యాన్ని పెంచితే దేశం అభివృద్ధి చెందుతుంది. తమ భవిష్యత్తుకు భరోసా కావాలని యువత కోరుకుంటున్నారు. అందుకే ఎన్నికల్లో ఎక్కువ మంది యువతీ యువకులు ఓటింగ్‌లో పాల్గొంటున్నారు. 2014లో బిజెపి అధికారంలోకి రావడంలో మొదటిసారి ఓటు హక్కు పొందిన యువతలో 87 శాతం మంది ఆ పార్టీకి ఓటు వేశారు. వివిధ రాష్ట్రాల్లో బిజెపి సాధించిన ఎన్నికల విజయాల్లో యువత ఓటింగ్ కీలకమైంది. మన రాష్ట్రంలో గత ఎన్నికల్లో మొదటిసారి ఓటు పొందిన యువకులు అత్యధికం వైసిపికి వేశారు. అధికారంలోకి రావాలనుకుంటున్న తెలుగుదేశం పార్టీ యువగళం పేరుతో పాదయాత్ర నిర్వహిస్తున్నది. ఎన్నికలు దగ్గరకు వచ్చేకొద్దీ దేశంలో, రాష్ట్రంలో యువతకు అనేక హామీలు వరదల్లా చుట్టుముట్టనున్నాయి. పాలక పార్టీలకు ఓట్లు, సీట్లు తప్ప యువశక్తికి అవసరమైన నైపుణ్యాన్ని అందించాలనే ప్రయత్నం మాత్రం చాలా స్వల్పం.

**నైపుణ్య కొరతలో యవశక్తి**

పనుల కోసం రాష్ట్రాలు దాటి వలసలు వెళ్తున్న యువకుల్లో అత్యధికమంది ఇంటర్, డిగ్రీ చదివినవారు లేదా ఆ స్థాయి చదువులు మధ్యస్తంగా ఆపేసినవారు. భవన నిర్మాణ కార్మికులుగా మహా నగరాలకు పెద్ద ఎత్తున వలసలు పోతున్నారు. ఈ యువ కార్మికులు ఎంతటి దుర్భర పరిస్థితుల్లో వున్నారో తెలుసుకోవడానికి భువనేశ్వర్ నుండి యశ్వంత్‌పూర్ వెళ్లేట ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, హౌరా నుండి గోవా %ఎ%టళ్లే వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్ రైళ్లను చూస్తే అర్థమవుతుంది. రిజర్వేషన్ కోచ్‌లలో సైతం కిక్కిరిసి, అలసిపోయి, రెండు మూడు రోజులుగా స్నానాలు చేసే అవకాశం లేని ఆ యువతీ యువకులంతా గ్రామీణ ప్రాంతాలకు చెందిన అక్షరాస్యులు. వీరిలో అత్యధికులు స్వంత భూములు లేనివారు, సామాజికంగా అట్టడుగు వర్గాలకు చెందినవారు. కాంట్రాక్టర్ల మోసాలు, యజమానుల వేధింపులు, మహిళలకు జరుగుతున్న అవమానాలు తెలిసినా ఏమీ చేయలేని నిస్సహాయులు. స్వంత అనుభవంతో భవన నిర్మాణ పనులు నేర్చుకొని అద్భుతమైన ప్రతిభతో సుందర భవనాలను నిర్మిస్తున్న కార్మికులు వీరు. వీరికి నైపుణ్య శిక్షణ ఇచ్చి వృత్తి అవకాశాలు కల్పించాలనే స్పృహ పాలకులకు ఏ మాత్రం లేకపోగా, నైపుణ్యం లేని కార్మికుల పేరుతో మరింతగా దోచుకోవడానికి సంపన్నులకు పాలక పార్టీలు తోడ్పడుతున్నాయి. డిగ్రీ, పీజీలు చేసిన వారిలో సగం మందికి నైపుణ్యత లేదని అందువల్ల ఉద్యోగాలు పొందలేకపోతున్నారని అనేక గణాంకాలు చెబుతున్నాయి. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) ఇటీవల ప్రకటించిన నివేదిక సారాంశం కూడా ఇదే. కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వశాఖ 2021 నివేదిక ప్రకారం విద్యావంతుల్లో ఉద్యోగార్హత కలిగినవారు కేవలం 50 శాతం లోపు మాత్రమే వున్నారు. బి.టెక్ 47 శాతం, 47 ఎం.బి.ఏ, 43 బి.ఏ, 40 శాతం బి.కాం, 30 శాతం బి.ఎస్సీ విద్యార్థులకు మాత్రమే ఉద్యోగ నైపుణ్యత ఉన్నట్లు తెలిపింది. బి.ఫార్మసీ చదివిన వారిలో నిరుద్యోగం 67 శాతంగా వుంది. ఐటిఐ లలో చదువుకున్న వారిలో 75 శాతం మందికి ఉపాధి నైపుణ్యాలు లేవని ఇండియా స్కిల్ రిపోర్టు పేర్కొంది. 1951 నాటికి మన దేశ అక్షరాస్యత కేవలం 16.7 శాతం. 72 సంవత్సరాల స్వదేశీ పాలన తర్వాత నూటికి 64 శాతం మందికి ఎంతో కొంత చుదువు దక్కింది. అయితే డిగ్రీలు చదివిన విద్యావంతుల్లోనే సగం మందికి సరైన నైపుణ్యత లేకపోతే అంతకంటే దిగువ చదువుల నాణ్యత ఏమిటి? నైపుణ్యాన్ని అందించలేని చదువులతో ఆధునిక ప్రపంచంతో ఎలా పోటీ పడగలం? ఇంటర్, డిగ్రీ స్థాయిలలో మంచి మార్కులతో విద్యార్థులు ఉత్తీర్ణులవుతున్నప్పటికి ఎందుకని ఉద్యోగ నైపుణ్యత సాధించలేకపోతున్నారు ?

**అధ్యాపకుల కొరత**

ప్రభుత్వాల విధానాలు, ప్రచార హోరు, మధ్యతరగతి ఆశల మధ్య దేశవ్యాప్తంగా విద్యా ప్రైవేటీకరణ వేగంగా విస్తరిస్తున్నది. అయితే ఇక్కడ చదువులు నేర్పుతున్న అధ్యాపకుల్లో ఎంతమంది అర్హత కలిగిన వారు వున్నారనేది ప్రశ్నార్థకం. 2021 ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని యునెస్కో భారతదేశ విద్యపై ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రైవేట్ విద్యాలయాల్లో అర్హత లేని అధ్యాపకులు నర్సరీ స్థాయిలో 51 శాతం, ప్రాథమిక స్థాయిలో 41 శాతం, ప్రాథమికోన్నత స్థాయిలో 55, సెంకడరీ స్థాయిలో 52, ఉన్నత విద్యలో 61 శాతం మంది వున్నారు. విద్యా పునాది నుండే అధ్యాపకుల పరిస్థితి ఇలా వుంటే నాణ్యమైన విద్య ఎలా వస్తుంది? నైపుణ్యత ఎక్కడి నుండి అందుతుంది? ఉన్నత విద్యా కేంద్రాలైన యూనివర్శిటీలలో ప్రొఫెసర్ల కొరత చాలా తీవ్రంగా వుంది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో వున్న కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో 59 శాతం ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా వున్నట్లు సమాచార హక్కు చట్టం ద్వారా ఎస్.ఎఫ్.ఐ అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సమాధానం ఇది. కొత్తగా ప్రారంభించిన కేంద్రీయ విశ్వవిద్యాలయాల పరిస్థితి అతిథి అధ్యాపకులు, అద్దె భవనాలుగా వుంది. దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన విద్యా కేంద్రాలుగా భావిస్తున్న ఐఐటి లలో కూడా సిబ్బంది కొరత వుంది. 23 ఐఐటి లలో మంజూరైన పోస్టులు 10,881 కాగా... 4,370 పోస్టులు భర్తీ చేయాల్సి వుందని పార్లమెంట్‌కు ఈ ప్రభుత్వం తెలిపింది. ఉన్నత విద్యారంగం ఇంత అధ్వాన్నంగా వుంది కాబట్టే విశ్వవిద్యాలయాల అంతర్జాతీయ ర్యాంకుల స్థానాల్లో దేశీయ విశ్వవిద్యాలయాలు పదిలో ఒకటి కాదు, వందలో ఒకటి కూడా వుండడంలేదు. రాజకీయ ప్రచారం కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలను ఏర్పాటు చేయడం ద్వారా ఇది పరిష్కారం కాదు. మన యువత నైపుణ్య కొరతకుగల కారణాలను నిష్పక్షపాతంగా పరిశీలించి శాస్త్రీయ పరిష్కార చర్యలు తీసుకోవాలి. అప్పుడే మన దేశం రానున్న కొన్ని దశాబ్దాల్లోనైనా ప్రపంచ అగ్ర దేశాలతో పోటీ పడగలదు.

**కేంద్ర ప్రభుత్వ తిరోగామి విధానాలు**

ప్రాథమిక పాఠశాల స్థాయి నుండి ఉన్నత విద్యాలయాల వరకు సరిపడ అధ్యాపకులు, ల్యాబ్‌లు, లైబ్రరీలు, మౌలిక సౌకర్యాలు అందుబాటులో లేకపోతే యువతకు నిపుణత ఎలా అందుతుంది? విద్యారంగాన్ని మెరుగుపరచి నైపుణ్యాన్ని పెంచడం కంటే కేంద్రీయ విశ్వవిద్యాలయాలను నిర్వీర్యం చేయడం, పోలీసులు, గూండాల ద్వారా విద్యార్థులు, అధ్యాపకుల మీద దాడులు చేయించడం, మైనారిటీ అమ్మాయిలు ధరించే హిజాబ్ లాంటివి వివాదం చేయడం, వైస్ ఛాన్సలర్ల ద్వారా నిర్బంధ విధానాలు అమలు చేసి రాజకీయ లబ్ధి పొందేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారు. ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత విద్య వరకు పాఠ్యాంశాలను బిజెపి మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ ఆలోచనలకు అనుగుణంగా మారుస్తున్నారు. కొద్దిమందికి మాత్రం అత్యంత ఆధునిక విద్య, కోట్లాది మందికి ప్రాచీనకాలం నాటి వర్ణ వ్యవస్థను బలపరచే అశాస్త్రీయ విద్యను అందించాలని బిజెపి నేతలు భావిస్తున్నారు. ఆటోమేషన్ వంటి అనేక నూతన శాస్త్రీయ పరిశోధనలు ప్రపంచాన్ని అబ్బుర పరుస్తుంటే... జ్యోతిష్యం, భూతవైద్యం అంటూ కొన్ని శతాబ్దాల నాటి విద్యా విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. యువ శ్రామికశక్తిలో 70శాతం గ్రామీణ ప్రాంతం నుండి వస్తున్నారు. వీరికి వృత్తిశిక్షణ, ఐటిఐ, పాలిటెక్నిక్ లాంటివి అందుబాటులో వుంచి నైపుణ్యాన్ని పెంచాలి. స్కిల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, గ్లోబల్ విద్య అంటూ చేస్తున్న ఉత్తుత్తి ప్రచారం ఎన్నికల్లో కొద్దికాలం ఓట్లు రాల్చవచ్చునేమో కాని యువత భవితకు ఏ మాత్రం ఉపయోగపడదు. రాజ్యాంగం హామీ ఇచ్చిన శాస్త్రీయమైన, నైపుణ్యవంతమైన విద్యా విధానం అందరికీ కావాలి.

## చంద్రగూడెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఎన్టీఆర్ జిల్లా, మైలవరం, ప్రజా పాలన ప్రతినిధి: మండలం చంద్రగూడెం గ్రామంలో రూ.25 లక్షల ఎంపీ నిధులతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి, రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిమెంట్ రహదారుల నిర్మాణానికి మైలవరం శాసనసభ్యులు శ్రీ వసంత వెంకట కృష్ణప్రసాదు గారు బుధవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు కృష్ణప్రసాదు మాట్లాడుతూ గౌరవ సీఎం జగన్మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన కొనసాగిస్తున్నారని వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో గ్రామాల్లో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో శాశ్వత భవనాలు నిర్మించడంతో గ్రామాలకు శాశ్వత ఆస్తులు సమకూరాయన్నారు. ప్రజల సౌకర్యార్థం గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలపై అర్జీలు సమర్పించగా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామస్తులు శాసనసభ్యులు కృష్ణప్రసాదు కి ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పల్నాడు శివారు గ్రామాల్లో మొబైల్ టవర్లు



నరసరావుపేట: జూన్ 21. (ప్రజాపాలన ప్రతినిధి): సిగ్నల్స్ లేని పల్నాడు జిల్లా శివారు గ్రామాల్లో మొబైల్ టవర్లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు గుంటూరు టెలికం జిల్లా సేల్స్, మార్కెటింగ్ అసిస్టెంట్ జనరల్ మేనేజరు ఎం.ఎస్. ప్రసన్న కుమార్ స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేట కేంద్రంలోని ఎర్రాప్రగడ టెలికాం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన వినియోగదారుల అవగాహనా సదస్సులో మాట్లాడారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నరసరావుపేట సబ్ డివిజన్ పరిధిలో 20 ఎక్చేంజిలు ఉన్నాయని, 2000 ల్యాండ్ లైన్ కనెక్షన్ లు ఉన్నాయన్నారు. అంతేకాక 4,400 ఫైబర్ కనెక్షన్లు ఇంటింటికి అందజేశామన్నారు. ఇప్పటికీ 15 వై.ఫై. పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. నరసరావుపేట డి.ఈ. చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్రైవేటుతో ప్రమేయంలేకుండా చిలకలూరిపేట, నరసరావుపేట కస్టమర్ సర్వీసు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్థానిక ఎస్.డి.ఈ. నాగరాజు మాట్లాడుతూ వినియోగదారుల ఫిర్యాదులకు తక్షణమే స్పందిస్తున్నామన్నారు. జె.టి.ఒ. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి వినియోగదారునికి తమ వంతుగా సేవలు అందిస్తున్నామన్నారు. టెలికం సలహా కమిటి ఉమ్మడి గుంటూరు జిల్లా సభ్యులు నిమ్మరాజు చలపతిరావు మాట్లాడుతూ %దీూచీూ% కు పూర్వ వైభవం చేకూరబోతున్నట్లు, ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా 4జి, 5జి సేవలకు వీలుగా %దీూచీూ% కు 89,047 కోట్ల రూపాయలు కేటాయించటం జరిగిందన్నారు. ఈ సమావేశంలో టెలికం అధికారులు, వినియోగదారులు పాల్గొన్నారు.

## అమృత సరోవర్ ల వద్ద ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం-డ్వామా పథక సంచాలకులు సి.వి శ్రీనివాస్ ప్రసాద్



ప్రజాపాలన న్యూస్. శ్రీకాళహస్తి :ఏర్పేడు (జూన్ 21) అమూడురు పంచాయతి, బండారు పల్లి పంచాయతీ పరిధిలో గల అమృత సరోవర్ ల వద్ద అంతర్జాతీయ యోగా దినోత్సవం ను ఉపాధి హామీ పథకం కూలీలు, గ్రామస్థులు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధుల మధ్య అంతర్జాతీయ యోగా దినోత్సవంను నిర్వహించి యోగా చేయడం వలన కలుగు ఆరోగ్య ప్రయోజనంలను, మానసిక ఉలసం, పలు రకాల ఆరోగ్య సమస్యలకు యోగా ఓక మంచి సాధనమని సూర్య నమస్కారాలు, ప్రమాణసనము, పార్వతాసనము, కోణసనము, చక్కి చలానాసము, ధనురాసనము, భుజంగాసనము, విపరీత శలభాసనము, నిలబడి ఓక చేయి పై కేత్తి ఓక వైపుకి ఒంగడంను కోణాసనము అని, త్రికోణము వలె ఉండటం ని త్రికోణసానము అని, పాదములు దూరంగా ఉంచి ముందుకు వంగడము, వృక్షసనము, కుర్చీ ఆసనము వంటి అసనాలు చేయడము వలన కలుగు ప్రయోజనాలు డ్వామా పథక సంచాలకులు-సి.వి శ్రీనివాస్ ప్రసాద్ వివరించారు.ఈ కార్యక్రమం లో అముడూరు పెరుమాళ్, ఈశ్వరయ్య,ఫీల్డ్ అసిస్టెంట్లు రవిచంద్ర, వెంకటేష్,మున్నేంద్ర వర్మ, టెక్నికల్ అసిస్టెంట్ రవీంద్రుడు జూనియర్ ఇంజనీర్ బాలాజీ రావు,ఏ.పి.ఓ అవిలాల దేవరి,సి.సి భాను, గురు, చందు ఉపాధి హామీ కూలీలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి పాటుపడతా..

## పెడన మండల విద్యాశాఖ అధికారి 2. వైవి హరనాథ్



మచిలీపట్నం జూన్ 21: ప్రజాపాలన : పెడన మండలంలో నిరంతరం విద్యాభివృద్ధి కోసం పాటుపడతానని పెడన మండల విద్యాశాఖ అధికారి 2 , హరనాథ్ అన్నారు. ఇటీవల ప్రభుత్వం నూతన ఎంఈవోలుగా పోస్ట్ లు మంజూరు చేసింది. దానిలో భాగంగా గుండుపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గా పనిచేస్తున్న హరనాథ్ ఇటీవల పెడన మండల విద్యాశాఖ అధికారి 2 గా, బాధ్యతలు చేపట్టారు. జగనన్న ప్రభుత్వం నాడు నేడు ద్వారా పాఠశాలల దశ, దిశ, మారుస్తూ విద్యావ్యవస్థ పటిష్టతకోసం నూతన ప్రణాళికలతో ముంద డుగు వేస్తోంది. దానిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మండలానికి ఇద్దరు మండల విద్యాశాఖ అధికారులను నియామకం చేయడం జరిగింది. ఈ ప్రక్రియ లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లో రెండవ ఎంఈఓ పోస్టు జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు గా పనిచేస్తున్న వారికి పదోన్నతి కల్పించి భర్తీ చేయడం జరిగింది. నూతన ఎంఈఓ గా పెడన మండలానికి వచ్చిన హరనాథ్ , మీడియాతో మాట్లాడుతూ తాను ఉపాధ్యాయుడుగా, ప్రధాన ఉపాధ్యాయుడిగా, దాదాపు 30 సంవత్సరాల అనుభవం గడించానని, అన్నారు. ఎన్నో ఆటు పోట్లు అధిగమించి ఈ స్థాయికి చేరుకోగలిగానని అన్నారు. సంకల్పబలం,ఆశయం పట్టుదల, ఉంటే ఏదైనా సాధించవచ్చుని, హరనాథ్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యావ్యవస్థ పటిష్టత కోసం కృషి చేస్తానని, నిరంతరం పాఠశాలలను సందర్శించి ప్రధానోపాధ్యాయులకు ఉపాధ్యాయులకు తగిన సలహాలు సూచనలు అందిస్తానని అన్నారు.మండలం లో జేవీకే కిట్స్ పంపిణీ ప్రక్రియ ఇప్పటికే చాలా పాఠశాలల్లో పూర్తి చేయడం జరిగిందని అన్నారు. మధ్యాహ్న భోజన అమలు తీరు క్షుణ్ణంగా పరిశీలించి మెరుగైన మధ్యాహ్నం భోజనం అందించేలాగా వంట ఏజెన్సీ వారికి సలహాలు, సూచనలు అందిస్తానన్నారు. ప్రధానోపాధ్యాయులు తో, వంట ఏజెన్సీ వారితో నెల వారీ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తానని అన్నారు. తాను మండల విద్యాశాఖ అధికారిగా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టినందువలన, పెడన మండల విద్యావ్యవస్థ పై పూర్తిస్థాయిలో పట్టు అవగాహన సాధించడానికి కనీసం ఒక నెల సమయం పడుతుందని అన్నారు. మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లు 7 , ప్రాథమికోన్నత పాఠశాలలు 7, ప్రాథమిక పాఠశాలలు 52, గురుకుల పాఠశాల 1, ఉన్నాయని, అన్నారు. ప్రతి పాఠశాలలోనూ, టాయిలెట్స్ నిర్వహణ, శుభ్రత పరిశుభ్రత అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. నాడు, నేడు రెండవ దశ లో పాఠశాల అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యే లాగ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. బడి బయట పిల్లలు లేకుండా నూరు శాతం , విద్యార్థులు పాఠశాలలో చేరేలాగా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయుల డైరీ, టీచింగ్ నోట్స్, పాఠశాల నిర్వహణ రికార్డులు రిజిస్టర్లు క్రమ పద్ధతిలో నిర్వహించి, మండల విద్యాశాఖ ని ప్రథమ స్థానంలో నిలపాలని ప్రధానోపాధ్యాయులు కి హరనాథ్ సూచించారు. అలాగే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి అంకితభావంతో నిరంతరం పాటు పడతానని అన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ సూచనల మేరకు, మండల విద్యాభివృద్ధి కోసం నిరంతరం పాటుపడతానని హరనాథ్ అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారుల, మండలంలో అధికారుల, అనధికారుల, సలహాలు , సూచనలు పాటిస్తూ మండల విద్యా ప్రగతి కోసం కృషి చేస్తానన్నారు.

## మహాత్మా గాంధీ హాస్పిటల్ లో కరోటి డ్ స్టంట్ రెండు వైపులా ఒకేసారి అమర్చి ఆపరేషన్ విజయవంతం



పల్నాడు జిల్లా. నరసరావుపేట. జూన్ 21 (ప్రజాపాలన ప్రతినిధి): మహాత్మా గాంధీ హాస్పిటల్ లో కరోటి డ్ స్టంట్ రెండు వైపులా ఒకేసారి అమర్చి ఆపరేషన్ విజయవంతం అయినట్లు మహాత్మా గాంధీ హాస్పిటల్ ఎండి డాక్టర్ కారసాని శ్రీనివాస్ రెడ్డి న్యూరాలజిస్ట్ డాక్టర్ ప్రతీప్ కుమార్ తెలిపారు. బుధవారం మహాత్మా గాంధీ హాస్పిటల్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ లింగంగుంట్ల గ్రామానికి చెందిన పాములమ్మ 67 సంవత్సరాలు అనే మహిళ పక్షవపాతంతో హాస్పటల్ కు వచ్చిందని ఆమెను డాక్టర్ ప్రదీప్ కుమార్ న్యూరాలజిస్ట్ వైద్య పరీక్షలు చేశారని ఆమెకు మెదడుకు వెళ్లే రక్త నాళాలలో రెండు వైపులా పూడికలు ఉన్నట్లు గుర్తించారని వెంటనే ఆమెకు కరో టిడ్ యాంజి యోగ్రామ్ చేయగా రెండువైపులు పూడికలు ఉన్నట్టు గుర్తించారు వెంటనే ఈ నెల 19వ తారీఖున పాములమ్మకు కరోటిడ్ స్టంట్ రెండు వైపులా ఒకేసారి అమర్చి ఆపరేషన్ విజయవంతం చేశామని డాక్టర్ తెలిపారు పాములమ్మకు ఎడమవైపు 80% కుడివైపు 70% కూడిక ఉన్నట్లు గుర్తించి వెంటనే ఆపరేషన్ చేసి ఆపరేషన్ విజయవంతం చేశామని అన్నారు రోగి పరిస్థితి కూడా బాగా ఉండటంతో 48 గంటల్లో డిశ్చార్జ్ చేశామని తెలిపారు బిపి షుగర్ కొలెస్ట్రాంట్ ఉంటే పక్షవాతం వస్తుందని తెలిపారు. షుగర్ బిపి కొలెస్ట్రాల్ ఉన్నవారు డాక్టర్ను సంప్రదించాలని అన్నారు పక్షవాతం వచ్చే లక్షణాలు ఉంటే నాలుగు న్నర గంటల్లోనే న్యూరాలజిస్ట్ సంప్రదించి ఇంజక్షన్ చేయించుకోవాలని తదుపరి వైద్యం చేసుకోవాలని తెలిపారు. మెదడుకు వెళ్లే రక్తనాళాలు రెండు వైపులా పూడికలు ఉంటే స్టంట్ అమర్చుకోవచ్చని మరల పక్షవాతం రాకుండా చూసుకోవచ్చని డాక్టర్ కారసాని శ్రీనివాస్ రెడ్డి మరియు డాక్టర్ ప్రతీప్ కుమార్ తెలిపారు. ఆపరేషన్ విజయవంతమైనందుకు రోగి పావులమ్మ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి కి డాక్టర్ ప్రతీప్ కుమార్ కి కృతజ్ఞతలు తెలిపారు.

## యోగాలో ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించిన దివ్యాంగ విద్యార్థులు

**సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ప్రపంచ యోగా దినోత్సవం.**

**అభినందించిన విద్యాశాఖా ఉన్నతాధికారులు.**




విశాఖపట్నం, ప్రజా పాలన ప్రతినిధి జూన్ 21:- సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ సహకారంతో బుధవారం విశాఖపట్నంలోని ఆంధ్రా విశ్వవిద్యాలయంలో 500 మంది దివ్యాంగ విద్యార్థినీ విద్యార్థులతో ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవం జరిగింది. ఈ మెగా కార్యక్రమం ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో నమోదైంది. ఈ కార్యక్రమానికి విశాఖపట్నం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున్ , ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఎన్ వి. జి. డి ప్రసాద్ , సమగ్ర శిక్ష రాష్ట్ర అదనపు పథక సంచాలకులు డాక్టర్ కె.వి శ్రీనివాసులు రెడ్డి , రాష్ట్ర సహిత విద్య కో ఆర్డినేటర్ ఎన్.కె. అన్నపూర్ణ , విశాఖపట్నం జిల్లా విద్యాశాఖాధికారిణి చంద్రకళ , అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల నుంచి దివ్యాంగ విద్యార్థులు, ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా విశాఖపట్నం జిల్లా కలెక్టర్ మల్లికార్జున్ మాట్లాడుతూ సమగ్ర శిక్షా దివ్యాంగులతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.ఆంధ్ర యూనివర్సిటీ వీసీ ప్రసంగిస్తూ మానవ జీవితంలో యోగా చాలా ప్రాముఖ్యత సంతరించుకుందని, దివ్యాంగులకు యోగా ద్వారా వారి జీవన శైలిలో మంచి మార్పులు తీసుకురావచ్చని వ్యక్తపరిచారు.అనంతరం రాష్ట్ర సమగ్ర శిక్ష అదనపు రాష్ట్ర పథక సంచాలకులు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగుల అభివృద్ధికి వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. అందులో భాగంగానే దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు, అలవెన్సులు, బోధనోపకరణ సామాగ్రి వంటివి అందిస్తున్నామన్నారు.అభినందించిన విద్యాశాఖా ఉన్నతాధికారులులిసమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జరిగిన ఇలాంటి బృహత్తర కార్యక్రమానికి ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు దక్కడం ఆనందదాయకమని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ ప్రవీణ్ ప్రకాష్ , పాఠశాల విద్యాశాఖ కమీషనర్ శ్రీ ఎస్.సురేష్ కుమార్ , సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు అభినందించారు.

## “విద్య ఉపాధి అవకాశాలు - ఆంగ్ల మాధ్యమం ఆవశ్యకత” అంశం పై సదస్సు



విజయవాడ ప్రజా పాలన ప్రతినిధి : సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో గురువారం (22.6.23) “విద్య ఉపాధి అవకాశాలు - ఆంగ్ల మాధ్యమం ఆవశ్యకత” అంశం పై సదస్సు నిర్వహించనున్నట్లు చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మొఘల్ రాజపురం లోని సి.ఆర్. మీడియా అకాడమీ కార్యాలయంలో ఈ సదస్సును ఉదయం 10 గంటలకు నిర్వహించ నున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ రాచయిత, కాలమిస్ట్ వెంకట్ పూల బాల రచించిన ‘ఆంగ్ల పద్య సంపుటి’ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సదస్సుకు సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ హెూదాలో తాము అధ్యక్షత వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో నవరత్నాలు ప్రోగ్రామ్ ఎక్సిక్యూటివ్ వైస్ చైర్మన్ ఎ. ఎస్. నారాయణ మూర్తి, ఏ.పి. ఎడిటర్స్ అసోసియేషన్ ప్రసిడెంట్ వి.వి. ఆర్. కృష్ణం రాజు, నాగార్జున యూనివర్సిటీ యూనివర్సిటీ గెస్ట్ ఫాకల్టీ ఎస్.ఎ. రెహమాన్, సి.ఆర్. మీడియా అకాడమీ సెక్రటరీ మామిడిపల్లి బాల గంగాధర్ తిలక్, జర్నలిస్టులు పాల్గొంటారని ఆ ప్రకటనలో ఆయన తెలిపారు.

## ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తాం



పల్నాడు జిల్లా .నరసరావుపేట. జూన్ 21 ( ప్రజా పాలన ప్రతినిధి): నరసరావుపేట నియోజకవర్గంలోని రామిరెడ్డి పేటలోని సన్నిధి ఫంక్షన్ హాల్ నందు బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం కార్యక్రమానికి నరసరావుపేట గౌరవ శాసనసభ్యులు డా. గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి గారు మరియు ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి మరియు ఉపాధ్యాయులతో కలిసి పాల్గొన్నారు అనంతరం ఉపాధ్యాయుల ఎదుర్కొంటున్న పలు సమస్యలను అడిగి తెలుసుకొని వారి ఎదుర్కొంటున్న సమస్యలు సీఎం జగన్ కి మరియు సంబంధించిన అధికారులకు దృష్టికి తీసుకువెళ్తానని వారి సమస్య పరిష్కరిస్తామని గౌరవ శాసనసభ్యులు డా. గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మరియు ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి గారు హామీ ఇచ్చారు. ఇటీవల జరిగిన పలు ఎంట్రన్స్ పరీక్షల్లో ఉత్తీర్ణతలగా పొసైన ఉపాధ్యాయులు పిల్లలని తల్లిదండ్రులతో కలిసి సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ఎంఈఓలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, పీఈటీలు, ఏపీ ఎయిడెడ్ కాలేజ్ లెక్చరర్లు, ఏపీ సమగ్ర శిక్ష పెట్ అసోసియేషన్ అసోసియేషన్ అధ్యక్షులు మరియు కమిటీ సభ్యులు మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వివిధ కార్పొరేషన్ చైర్మన్లు మరియు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## జండులో డిజిటలైజేషన్ ఇ - స్టాంపులు ప్రారభం అభినందనీయం - మండలి హనుమంతరావు



గుడివాడ : దశబ్ధకాలం నుండి ప్రజలకు అందుబాటులో ఉండే జండులో స్టాంపుల స్థానంలో డిజటలైజేషన్ భాగంగా ప్రభుత్వం ఇ-స్టాంపులను ప్రారంభించడం అభినందనీయమాని వైసీపీ సినీయర్ జిల్లా నాయకుడు మండలి హనుమంతరావు అన్నారు. బుధవారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న జండు యాజమాని దినవహి ఉమాకుమార్ నూతనంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన డిజటలైజేషన్ ఇ-స్టాంపులను వైసీపీ సినియర్ జిల్లా నాయకుడు మండలి హనుమంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గతంలో 100, 50, 20,10రూపాయిల నాన్‌జ్యుడీషియల్ స్టాంపుల స్థానంలో ప్రభుత్వం జండుకు ఇ-స్టాంపు లైసెన్సు మంజూరు చేసిందన్నారు. అఫిడవిట్లు చేయుడం, బ్యాంకలకు ఫైనాన్సు కంపెనీలకు అగ్రిమెంట్లుకు ఇ-స్టాంపింగ్‌ను ఉపయోగించుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో షయ్యద్ గఫర్, నండూరి బద్రినాథ్, డి.యస్,బి మౌళి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



గుడివాడ : యోగాతో పరిపూర్ణ ఆరోగ్య వికాసాన్ని పొందటమే కాకుండా మేధోసంపత్తి పెరుగుతుందని యోగామిత్ర కె.డి.వి.ఎన్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్దానిక ఎన్‌టిఆర్ స్టేడియం ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్టీఆర్ స్టేడియం, పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సుమారు వెయ్యిమందికి పైగా యోగాపై అవగాహన మరియు శిక్షణ అందించడం జరిగింది. అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, సంయుక్త కార్యదర్శి పర్వతనేని అనంద్, స్టేడియం కమిటీ సభ్యులు విద్యార్ధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్ధులతో యోగాసనాలను అభ్యసింపజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సోసైటి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## బిసి సంఘం అధ్వర్యంలో ఉప్పాల రాంప్రసాద్‌కు నివాళి



గుడివాడ : బీసీ సంఘ అధ్వర్యంలో డిసిసి మాజీ చైర్మన్ ఉప్పాల రాంప్రసాద్ మృతికి సంతాప కార్యక్రమాన్ని స్థానిక ముగ్గు బజార్ సమీపంలోని మహాత్మ జ్యోతిరావు, సావిత్రిబాయి పూలే విగ్రహాల వద్ద నిర్వహించారు. ఉప్పాల రాంప్రసాద్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావులకొల్లు నాగమల్లేశ్వరరావు, నియోజకవర్గ అధ్యక్షుడు దారం నరసింహారావు, నాయకులు గులిపల్లి ప్రభాకరరావు, వడ్డే గోవర్ధనరావు, జోగా సూర్యప్రకాష్‌రావు, పుల్లేటికుర్తి వినయ్‌కుమార్, షేక్ సయ్యద్, తదితరులు పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లా డిపిఆర్‌ఓ ఓం ప్రకాష్ కు అభినందనలు తెలిపిన విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నిమ్మరాజు చలపతిరావు



పల్నాడు జిల్లా. నరసరావుపేట. జూన్ 21 (ప్రజా పాలన ప్రతినిధి)పల్నాడు జిల్లా డిపి ఆర్ వో గా రి ఓం ప్రకాష్ (వైస్సార్ కడప) ఇటీవల బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బుధవారం విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నిమ్మరాజు చలపతిరావు / స్థానిక సీనియర్ జర్నలిస్టు డిపిఆర్వో అర్రూరి ప్రకాష్ తోపాటు డివిజనల్ పీఆర్వోఎస్. రవికుమార్, సమాచార అధికారిణి అల్లూరి దీప్తిని అభినందించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చలపతిరావు మాట్లాడుతూ అర్హులైన, సీనియర్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డు మంజూరు చేయాలని ఈ సందర్భంగా చలపతిరావు కోరారు.

## శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం నిత్యాన్నదాన పథకం లక్షల వెయ్యి నూట పదహారు రూపాయలు విరాళం అందజేసిన విజయవాడ వాస్తవ్యులు అర్కే కిశోర్



ప్రజాపాలన న్యూస్. శ్రీకాళహస్తి :శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం నిత్యాన్నదాన పథకముకి విజయవాడ వాస్తవ్యులు ఆర్కే కిషోర్ గ (లక్షల వెయ్యి నూట పదహారు రూపాయలు ) 1,01116/- శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు గారికి అందజేశారులిధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ అన్ని దానాల కంటే కూడా అన్నదానం చాలా గొప్పదని తెలియజేశారు స్వామిలి లిఅమ్మవార్ల దర్శనార్థం విచ్చేసిన భక్తుల కోసం ఏర్పాటుచేసిన నిత్య అన్నదానానికి విరాళాలను అందజేసిన యార్లగడ్డ ఆర్కే కిషోర్ మరియు కుటుంబ సభ్యులుకి తల్లి జ్ఞాన ప్రసూనాంబికా దేవి సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్ల చల్లని దీవెనలు ఎల్లప్పుడూ మీ కుటుంబ సభ్యులు ఉండాలని కోరుకుంటున్నానులివారికి ఆలయ ఛైర్మన్ గారు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేయించిలి లిస్వామి-అమ్మవార్ల శేష వస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఐసి బ్రాంచ్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉచిత మెడికల్ క్యాంపు




గోకవరం ప్రజా పాలన జూన్ 21: మండల కేంద్రమైన గోకవరం ఎల్ఐసి కార్యాలయంలో ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం. ఈ సందర్భంగా ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయడమైనది. బ్రాంచ్ మేనేజర్ విద్యా సాగర్,అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ ఎలిపే శ్రీనివాస్ మాట్లాడుతూ యోగా చేయడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని యోగా ఎముకలను దృఢంగా శక్తివంతంగా చేస్తుందని,రోగ నిరోధక శక్తి పెరగడానికి యోగ ఎంతగానో ఉపయోగపడుతుందని, అధికంగా ఆహారం తినాలి అనుకునే వారి కోసం యోగ అడ్డుకట్ట వేస్తుందని, నిద్రలేమని తరిమి కొట్టడానికి యోగ బాగా పనిచేస్తుందని,రక్తపోటుని తగ్గించడానికి యోగ ఎంతగానో ఉపయోగపడుతుందని, జీర్ణ క్రియను పెంచడంలో యోగ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చిన్ని బాబు సుమారు వందమందికి బిపి,షుగర్ టెస్ట్ లు చేసి పలు సూచనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆఫీస్ స్టాఫ్ యూనియన్ ప్రెసిడెంట్ చక్ర శ్రీను,ఆఫీస్ సిబ్బంది, ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె నూకరాజు,సెక్రటరీ ఎన్ నాగరాజు, డివిజనల్ కౌన్సిలర్ ఈసీ మెంబర్ జి నాగేశ్వరరావు, ఎల్ఐసి ఏజెంట్స్ పాల్గొనడం జరిగింది.

## అటవీశాఖ ఆధ్వర్యంలో వరల్డ్ యోగా డే



ప్రజాపాలన న్యూస్. శ్రీకాళహస్తి : ప్రతి ఏటా జూన్ 21 న జరుపుకుంటున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం ను బుధవారం శ్రీకాళహస్తి అటవీశాఖ అధికారులు శ్రీకాళహస్తి రేంజ్ పరిధిలోని చింతలపాలెం నర్సరీ యందు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా అటవీ క్షేత్రాధికారి శ్రీ పి. లోకేష్ గారు మాట్లాడుతూ యోగాకు సుమారు 5000 సంవత్సరాల చరిత్ర ఉందని, యోగా అనేది మానవుని యొక్క జీవన శైలిని సులభతరం చేయడానికి మరియు ఆరోగ్యంగా, ఆనందంగా ఉంచడానికి దోహదపడుతుందని తెలిపారు. శరీరం చేయగలిగే అత్యుత్తమ వ్యాయామాల్లో యోగాకు మొదటి స్థానం ఉంటుందని, యోగా అనేది ఒక్క శరీరం మీద మాత్రమే ప్రభావం చూపకుండా మెదడు మరియు ఆత్మ మొదలగు అన్ని అవయవాల స్థితిని వృద్ధి చేస్తుందని తెలిపారు. అంతేకాకుండా యోగా చేయడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, నరాల శుభ్రత కలుగుతుందని తెలిపారు. అంతేకాకుండా యోగా క్రమం తప్పకుండా చేయడం ద్వారా దీర్ఘకాలంలో వచ్చే వ్యాధులను కూడా అరికట్టవచ్చు అని తెలిపారు. తమ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న జనాభా మరియు ఇతర కారణాల దృష్ట్యా అటవి భూ ఆక్రమణలు, వన్య ప్రాణి సంరక్షణ, ఇతర అటవీ సంపదలను రక్షించే సమయంలో అటవీ అధికారులు తీవ్ర మానసిక ఒత్తిడిని అనుభవిస్తున్నారని, అనారోగ్య సమస్యలు కూడా వస్తున్నాయని తెలుపుతూ వాటిని అధిగమించుటకు యోగా అనేది బ్రహ్మాస్త్రంలా పనిచేస్తుందని ఇందులకు ప్రతి ఒక్కరూ యోగాను క్రమం తప్పకుండా చేయడం మరియు ఇతరులకు దీని ప్రాముఖ్యత గురించి తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, మరియు ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

## కాపుల ద్రోహి ముద్రగడ్డ.. గుంటూరు జిల్లా పొన్నూరు జనసేన నాయకులు ఆరోపణ



పొన్నూరు జూన్21( ప్రజా పాలన ప్రతినిధి) :కాపు కులంలో పుట్టి యావత్ కాపు లోకానికి ద్రోహం చేస్తున్న కాపు నాయకుడు, మాజీ మంత్రి ముద్ర గడ్డ పద్మనాభం కాపులందరికీ క్షమాపణ చెప్పాలని పొన్నూరు జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో జనసేన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్యాకేజీ కోసం జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పై అవాకులు చవాకులు పేలటం పై వారు ఆగ్రహ వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాల చరిత్రలో కాపుల కు ముద్రగడ్డ చేసినది ఏమీ లేదని వారు అన్నారు. రాబోయే ఎన్నికల్లో తన కొడుకు ఒక సీటు, ముద్రగడ్డకు ఒక సీటు ఆశిస్తూ జనసేన నేతపై విమర్శించటం పరిపాటిగా మారిందని వారు గుర్తు చేశారు. ఇప్పటినుంచైనా కాపు నాయకుడుగా చెప్పుకొనే ముద్రగడ్డ పద్మనాభం నోరు అదుపులో పెట్టుకోవాలని లేదా నీకు తగిన శాస్తి చేస్తామని హెచ్చరించారు. వైసిపి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై వారాహి యాత్ర ప్రారంభించిన పవన్ కళ్యాణ్ కు ప్రజాదరణ చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు ప్రత్యేక ప్యాకేజీ ఆశ చూపి ముద్రగడను వాడుకుంటున్నారని వారు ఈ సందర్భంగా అన్నారు. ఇప్పటికైనా కాపులందరూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వైపే ఉన్నారని రాబోయే రోజుల్లో రాష్ట్రంలో చరిత్ర తిరగరాసేందుకు ఇది ప్రారంభమని వారు జోష్యం చెప్పారు. కార్యక్రమంలో పొన్నూరు జనసేన మండలాధ్యక్షుడు నాగిశెట్టి సుబ్బారావు ,పట్టణ ఉపాధ్యక్షుడు యర్రసాని నాగభూషణం, గుంటూరు జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి అప్పారావు, పొన్నూరు రాధా రంగా మిత్రమండలి అధ్యక్షుడు యన్నం నాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి తోటా నాగరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి మిర్యాల చంద్రకాంత్, టౌన్ సెక్రటరీ చేబ్రోలు పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

## పొన్నూరు ఎంపీడీవో గా శ్రీనివాసరావు నియామకం



పొన్నూరు జూన్21( ప్రజా పాలన ప్రతినిధి) :పొన్నూరు మండలం ఎంపీడీవోగా అడిగొప్పల శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. తుళ్లూరు మండలం ఎంపీడీవో గా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా పొన్నూరు ఎంపీడీవో గా బదిలీ అయినట్లు శ్రీనివాసరావు తెలిపారు. కార్యదర్శిలు, కార్యాలయ సిబ్బంది ఎంపీడీవో శ్రీనివాసరావు కు పూలమాలలు అందించి స్వాగతం పలికారు.

## అంగన్వాడీ కేంద్రాలపై అవగాహన ర్యాలీ




పొన్నూరు జూన్21( ప్రజా పాలన ప్రతినిధి) :కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రాల వినియోగంపై బుధవారం పొన్నూరు మండలంలోని దండమూడి గ్రామం ఓసి కేంద్రంలో అవగాహన ర్యాలీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కేంద్రం కార్యకర్త పిడి. విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాలలో ఆటపాటలతో కూడిన విద్య, ఆరోగ్య పరిరక్షణ, పౌష్టికాహారం తదితర కార్యక్రమాలను కేంద్రాలలో చేపడుతున్నారని తెలిపారు. వేలాది రూపాయలు వెచ్చించి ప్రైవేటు బడులలో చిన్నారులను చేర్పించడం పై తల్లిదండ్రులకు ఆర్థిక ఇబ్బందులు గురౌతాయని పేర్కొన్నారు. గర్భిణీలు, బాలింతలకు అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రత్యేకమైన ఆరోగ్య పరిరక్షణ అందించటం జరుగుతుందని పేర్కొన్నారు. అంగన్వాడి కేంద్రాల విశిష్టత తదితర అంశాలను కార్యక్రమంలో వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు నయుం భాషా, ఆయా, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మ వారికి ఆషాడ మాసం సారె



విజయవాడ, ప్రజా పాలన ప్రతినిధి జూలై 21:శ్రీ కనకదుర్గ లలిత పారాయణ బృందం ఆధ్వర్యంలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల కు ఆషాడ సారె సమపర్పణ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. కొత్త గుళ్ల సమీపంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆర్యవైశ్య కళ్యాణ మందిరం నుండి కేరళ డప్పు వాయిద్యల, సన్నాయి మేళాల నడుమ మహిళలు అమ్మవారికి సారె సమర్పించేందుకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు వెల్లంపల్లి శ్రీనివాసరావు తో పాటు కన్యకా పరమేశ్వరి కమిటీ సభ్యులు, శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీ కనకదుర్గ లలితా పారాయణం బృందం ఆధ్వర్యంలో అమ్మ వారికీ ఆషాడ మాస లో సారె సమర్పించడం హర్షణీయమని పేర్కొన్నారు. శ్రీ కనకదుర్గ లలితా పారాయణం బృందం ఆధ్యాత్మిక సేవ లో తరిస్తూ దేవాలయాలలో కార్యక్రమలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. లోక కళ్యాణర్ధం ప్రతి కుటుంబం అమ్మ వారికీ సారె సమర్పించి జగన్మాత అనుగ్రహం పొందగలరని విజ్ఞప్తి చేశారు. శ్రీ కనకదుర్గ లలితా పారాయణం బృందం అధ్యక్షులు గ్రంధి రాము, రాధిక, మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుండి ఆషాడమాసం పురస్కరించుకొని దుర్గమ్మకు భక్తిశ్రద్ధలతో సారె సమర్పిస్తున్నామని పేర్కొన్నారు. వారంలో రెండు రోజులు క్రమం తప్పకుండా దుర్గమ్మ సన్నిధిలో వందలాదిమంది భక్తులచే పారాయణం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్తీక మాసంలో అమ్మవారికి 10 లక్షలు గాజులు సమర్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ చాంబర్ కామర్స్ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు , మరియు దుర్గా మల్లేశ్వర స్వామి వారి ట్రస్ట్ సభ్యులు బుద్ధ రాంబాబు, కట్ట సత్తయ్య, కేసరి నాగమణి, ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి పోలేపల్లి సుబ్బు, శ్రీ కన్యకా పరమేశ్వరి సత్రం అధ్యక్షుడు మరియు కార్యదర్శిలు బచ్చు వెంకట లక్ష్మీ వరప్రసాద్, బయన రాజేష్, తదితర సభ్యులు, భక్తి బృంద లు సారె ఊరేగింపులో పాల్గొని ఆరాధించి కొండపై అమ్మవారికి సమర్పించారు.....

## కొండమోడు పరిధిలోని వీరమ్మ కాలనీలో ఎంపీపీ ఎస్ పాఠశాలను రాజుపాలెం జడ్పిటిసి దొంత రెడ్డి సునీత రెడ్డి శ్రీనివాస రెడ్డి



రాజుపాలెం ప్రజా పాలన : సందర్శిం చారు ఈ సందర్భంగా ఆమె వచ్చేటప్పటికి పాఠశాల సిబ్బంది విద్యార్థు లకు బోధన చేసే పనిలో నిమగ్నమై ఉన్నారు కొత్తగా చేరిన విద్యార్థులతోప్లే కార్డ్స్ అక్షరాభ్యాసం చేస్తు న్నారు చిన్నారుల మధ్య జడ్పిటిసి దొంత రెడ్డి సునీత రెడ్డి కూర్చొని కొద్దిసేపు ముచ్చటించారు ఈ సందర్భంగా జెడ్పిటిసి దొంత రెడ్డి సునీత గారు నాడు నేడు కార్యక్రమం ఎంతవరకు వచ్చింది ప్రస్తుతం ఉన్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలను సుధారాణి అడిగి తెలుసుకున్నారు ఇటీవల బదిలీపై వెళ్లిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పూర్తి చార్జ్ ఇవ్వలేదని పాఠశాల హెచ్ఎం జెడ్పిటిసి గారికి తెలిపారు పాఠశాల అభివృద్ధి పనులకు నేను పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని మీకు ఏదైనా సమస్య ఉన్నప్పుడు వెంటనే నాకు తెలియపరచవలసిందిగా హెచ్ఎం కు సూచించారు ఈ ప్రాంతంలో ఎవరైనా విద్యార్థిని విద్యార్థులు బడికి రాకుండగా బడి బయట ఉంటే వారి వివరాలను కూడా నాకు ఇవ్వాల్సిందిగా జడ్పిటిసి కోరారు ఆమెతోపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధారాణి గారుదీనమ్మ అండ్ రూరల్ డెవలప్ సొసైటీ చైర్మన్ గరికపాటి శంకర్రావు గారుపాఠశాల ఉపాధ్యాయులు దేవి రెడ్డి శ్రీనివాసరావు గారు తోటకూర ఆంజనేయులు గారు తదితరులు పాల్గొన్నారు

## ఏరియా వైద్యశాల అభివృద్ధికి చేయూత



సత్తెనపల్లి ప్రజాపాలన :అట్టహాసాలకు దూరంగా, తన జన్మ దినోత్సవ వృధా ఖర్చులు తగ్గించుకొని ఏరియా వైద్యశాల అభివృద్ధిలో తానూ భాగ స్వామ్యమయ్యారు.. వృందా మహిళా కళాశాల డైరెక్టర్ అనూష. బుధవారం అనూష తన పుట్టినరోజు పురస్కరించుకొని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు రూ. 30 వేల విలువైన 25 సెలైన్ స్టాండ్లను అభివృద్ధి కమిటీ సమక్షంలో అందించారు. రాష్ట్ర జలవనరుల శాఖా మాత్యులు అంబటి రాంబాబు ఆధ్వర్యంలో ఏరియా వైద్యశాల అప్రతిహత అభివృద్ధి లో భాగంగా వనరులు/ వసతులు, వైద్య సేవలలో ఇతోధిక పురోగతి సాధించడం పట్ల స్ఫూర్తి పొంది. తాను ఈ చిన్న చేయూత నందిస్తున్నానని అనూష వివరించారు. అనూష సహృదయాతను ,సామాజిక బాధ్యతను ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కొత్త రామకృష్ణ, సూపరింటెండెంట్ లక్ష్మణరావు లు అభినందించి, జన్మ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు



కారంపూడి.. జూన్21...ప్రజాపాలన... ప్రతినిధి :అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కారంపూడి లోని స్థానిక బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హై స్కూల్ నందు యోగా క్లాసులు నిర్వహించారు ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ దాదాపుగా 13సంవత్సరాలుగా ప్రతిరోజు ఉదయం 5 గంటల నుండి 7 గంటల వరకు ఉచితంగా యోగ క్లాసులు నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్కరు యోగా చేస్తూ ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతోనే ప్రపంచ దేశాలని అందరినీ ఒప్పించి జూన్ 21 న యోగా దినోత్సవం గా ప్రకటించి యోగా చేయండి ఆరోగ్యంగా ఉండండి అనే నినాదంతో భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని భావనతోనే ఈ యోగ డే ప్రకటించారని ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటూ తమ కుటుంబాలను కూడా ఆరోగ్యంగా ఉంచాలని . ప్రతి ఒక్కరికి మాంసాహారం వద్దు శాకాహారమే ముద్దు అనే సూత్రం ప్రతి ఒక్కరూ పాటించాలని కారంపూడి ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనిఆ దేవుని కోరుకుంటున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు ఈ కార్యక్రమంలో యోగ క్లాస్ ల నిరాహుకులు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## యోగ ద్వారా వసుదైక కుటుంబం అనే తీమ్ తో యోగా డే నిర్వహించిన రోడ్డు సేఫ్టీ య న్. జి. ఓ.



పల్నాడు జిల్లా. నరసరావుపేట. జూన్ 21 (ప్రజా పలన ప్రతినిధి): యోగా డే ని పురస్కరించుకుని పల్నాడు జిల్లా కేంద్రం లింగమ్ గుంట్ల అగ్రహారం లో గల శంకరభారతీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ప్రధానోపాధ్యాయురాలు యమ్. పార్వతి అధ్యక్షతన విద్యాధినీ విద్యార్థుల కు యోగ నేర్పించారు. ఈ కార్యక్రమాన్ని రోడ్డు సేఫ్టీ. యన్. జి. ఓ సంస్థ వారు నిర్వహించారు. ఈ సందర్బంగా ప్రధానోపాధ్యాయురాలు యమ్. పార్వతి మాట్లాడుతూ యోగా తీమ్ "యోగ ద్వారా వసుదైక కుటుంబం"గురించి మాట్లాడుతూ యోగా చేయడం ద్వారానే వ్యక్తి కి మంచి ఆరోగ్యం చేకూరుతుంది అని, అదే విధంగా మంచి ఆరోగ్య కరమైన కుటుంబాన్ని "యోగ ద్వారా వసుదైక కుటుంబం"గా చెప్పుకోవచ్చు అని తెలిపారు. ఈ సందర్బంగా యన్. జి. ఓ అధ్యక్షులు మాట్లాడుతూ యోగాని నూట దెబ్బయ్ ఐదు దేశాల్లో ఆయా దేశ ప్రజలు చేస్తున్నారు అని ఈ యోగా అనేది విద్యార్థి దశనుండే అలవాటు చేసుకోవాలి అనివిద్యార్థులకు "గుడ్ సమరిటన్ "గురించి కూడా తెలిపారు. శ్రీ వాసవీ మిత్రమండలి అధ్యక్షులు చేగు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యోగా చేయండి మంచి ఆరోగ్యం తో జీవించాలని కోరారు. రఘువేంద్రా చారిటబుల్ అధ్యక్షులు పూనూరి కృష్ణ కుమారి మాట్లాడుతూ యోగా అనేది ఒక జీవన విధానం అని, జీవితం లో వృద్ధులు ఐన నాడు వారిని పిల్లలు తప్పనిసరిగా చూసుకోవాలి అని చెప్పారు. అనంతరం యోగా ఆసనాలు వేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు గారిని,అతిధులని య న్. జి. ఓ అధ్యక్షులు ఆర్. కె. దుర్గ పద్మజ శాలువా కప్పి సత్కరించారు ఈ కార్యక్రమం లో యన్. జి. ఓ సభ్యులు వెంకటేశ్వరరావు, సాంబశివరావు, బంగారయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఎమ్ ఇ ఓ రవీందర్ కి ఘన సన్మానం



పెనుగంచిప్రోలు జోన్ 21 ప్రజాపాలన ప్రతినిధి: పెను గంచిప్రోలు మండల విద్యాశాఖాదికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎమ్ ఇ ఓ రవీందర్ కి ఎపిటీఫ్ అధ్వ ర్యంలో పలువురు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తె లియజేశారు. శెట్టిపోగు రాము అధ్యక్షతన జరిగిన కా ర్యక్రమంలో ఆయనకు శాలువాతో ఘన సన్మానంచే శారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఎంతో మంది ఉపాధ్యాయులకు మార్గదర్శిగా ఉం టూ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి చేస్తున్న పథ కాలను ముందుకు తీసుకెళ్తూ నాడు నేడు, జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, విద్యా దీవెన వం టి పథకాలను సమర్ధంగా నిర్వహిస్తూ మండలంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని కైవసం చేసుకున్నార న్నారు ఈకార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేష న్ మండల అధ్యక్షులు శెట్టి పోగు రాము, ప్రధాన కా ర్యదర్శి షేక్ ఖాజా, జిల్లా కౌన్సిలర్ గుడిమెట్ల వెంక టే శ్వరరావు, శ్రీహరి ప్రసాద్, ఆఫీస్ సిబ్బంది చందు, అ కౌంటెంట్ రమేష్ ఎమ్ ఐ ఎస్ కో ఆర్డినేటర్ నరేష్ లు తదితరులు పాల్గొన్నారు

## భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా అం తర్జాతీయ యోగా దినోత్సవం



నందిగామ జూన్ 21 ప్రజాపాలన ప్రతినిధి అంతర్జా తీయ యోగా దినోత్సవం కార్యక్రమాన్ని పురస్కరిం చుకొని పట్టణంలోని బిజెపి ఆధ్వర్యంలో ఆ పార్టీ ని యోజకవర్గ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య ఆధ్వ ర్యంలో ఘనంగా యోగా దినోత్సవ వేడుకలను జరు పుకున్నారుఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు యోగా విశ్వగురువుగా భారతదేశం అవతరించిందనిభారతదేశ సనాతన ధర్మాన్ని విశ్వ వ్యాప్తం చేసిన మన ప్రధానమంత్రి మోడీ అని యోగా వల్ల మనకు ఆరోగ్యం ఆనందం రెండు ఉచితంగా ల భిస్తాయని చెప్పారుప్రతి ఒక్కరు యోగా చేయాలని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన కోరా రు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పులిపాటి ల క్ష్మణ రావు. బండారు కేదార్నాథ్ శర్మ. కొమరగిరి వాచె స్ పతి. భాదర్ల వీరాంజనేయులు. కటుకూరి సుందర్రా వు తొర్లికొండ రాజారావు. మాగం బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## మాదిగ శంకర్ ను హత్య చేసిన వారిని ఎందుకు అరెస్ట్ చేయడంలేదు: జై భీమ్ యం ర్ పీ స్



ఆదోని ప్రజాపాలన ప్రతినిధి :ఆదోనిలో మాదిగ శంకర్ ను హత్య చేసిన అగ్రవర్ణ కులాల వారిని వెంటనే అరెస్టు చేసి, రిమాండ్ కు తరలించి, ఉరితీయాలని ఆగ్రహం వ్యక్తం చేసిన జై భీమ్ ఎమ్మార్పీఎస్ జై భీమ్ ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా అధ్యక్షులు ముత్తు సుమాల మాదిగ ఆధ్వర్యంలో నేడు ఆదోని టౌన్ మండగిరిలో హత్యకు గురైన మాదిగ శంకర్ పార్థివ దేహానికి పూలమాలేసి నివాళులర్పించి,శంకర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి ఈ సందర్భంగా జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జడ రవి మాదిగలు మాట్లాడుతూ... కర్నూలు జిల్లా ఆదోని టౌను మండగిరి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మాదిగ ఇటికల చెక్కర శంకర్ ను 19-06-2023 వ తేదీ సాయంత్రం 4:17 నిమిషాలకు పోలీసులు చూస్తూ ఉండగానే అగ్రవర్ణ కులానికి చెందినటువంటి రామలింగడు, జయరామిరెడ్డి,జగన్నాథ్ రెడ్డి,రామకృష్ణులు అతికిరాతకంగా వేటకొడవళ్ళు, ఇనుపరాడులతో నరికి చంపడం జరిగింది. ఈ దేశానికి ఇది ఒక చెంపపెట్టు లాంటిది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోన రోజురోజుకు దళిత గిరిజనుల పైన హత్యలు, మానభంగాలు నెమలి విప్పి పింఛములాగా నాట్యం చేస్తున్నావి. ఇలా చెప్పుకుంటూ పోతే రాష్ట్రంలోనూ గరగపర్రు వేంపేట,చుండూరు, గురజాల,రచ్చ మర్రి,పెద్ద గోనెహాలు, బినిగేరి, కామవరం,ఆదోని టౌన్ మండిగిరి వరకు హత్యలు ఎక్కువైపోతే, కర్నూలు జిల్లా ఆదోని డివిజన్ పరిధి నందు దళితులపై విపరీతమైన హత్యలు, పరువు హత్యలు, మానభంగాలు, కులవివక్షతలు ఎక్కువ జరుగుతూ ఉంటే కర్నూల్ జిల్లా కలెక్టర్ వారు, కర్నూలు జిల్లా ఎస్పి వారు, ఆదోని డీఎస్పీ వారు పూర్తిగా విఫలమైనారని మాట్లాడి,మాదిగ ఇటికల చక్కెర శంకర్ గారిని చంపిన ముద్దాయిలు రామలింగడు జయరామిరెడ్డి,జగన్నాథ్ రెడ్డి,రామకృష్ణుడు ఇంకా వీరి వెనక ఎవరైతే ఉన్నారో వారందరినీ కూడా అరెస్టు చేసే రిమాండ్ కు తరలించి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా ఉరిశిక్ష పడాలని మాట్లాడి, తక్షణమే కుటుంబ సభ్యులకు ఎస్సీ, ఎస్టీ చట్ట ప్రకారం బాధితులు కూతురు ఐ సి వైష్ణవి కు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి 15 లక్షలు ఆర్థిక సాయం, 5 ఎకరాల పొలము,5 సెంట్లు ఇళ్ల స్థలలాను కట్టించి ఆదుకోవాలని మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో జై భీమ్ ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న, జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్చార్జి సురేష్ సుమాల, జై భీమ్ ఎమ్మార్పీఎస్ నందవరం మండల అధ్యక్షుడు శవాల బుజ్జిబాబు,జై భీమ్ ఎమ్మార్పీఎస్ నందవరం మండల ఇన్చార్జి చింపిరి చిన్న పోతప్ప మరియు రమేష్,నాగరాజు,ఈరన్న, నాగప్ప, మురళి,వీరేష్, ఆదోని టౌన్ వాళ్లు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది

## కౌలు రైతు లకు సి.సి.ఆర్.సి. కార్డు పై అవగాహన సదస్సు

నందిగామ జూన్ 21 ప్రజా పాలన ప్రతినిధి మండలం లోని కేతవీరునిపాడు గ్రామంలో గల రైతు భరోసా కేంద్రం ( ఆర్.బీ.కే. )నందు .వి.ఎ.ఎ మస్తాన్ ఆధ్వర్యం లో కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహిం చా రు ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లా డు తూ పొలం లేని కౌలు రైతులు అందరూ 2023 -24 ఖరీఫ్ సీజన్ కు సంబంధించిన కౌలు రైతులు సి సిఆ ర్సీకార్డు కచ్చితంగా తీసుకుని పంట వేసిన వెంటనేఈ -క్రాప్ బుకింగ్ నమోదు చేయించుకోవాల న్నారుకౌలు రైతులంతా వారి ఆధార్ కార్డు, సర్వే నెం బర్లను వి. ఆర్.ఓ.కి లేదా వాలెంటీర్ల ద్వారా అం దించి సాగు ధృ వీకరణ పత్రం ( సి.సి.ఆర్.సి. ) తీసు కోవాల ని రైతు లకు తెలిపారు ఈ కార్యక్రమానికి డి. శ్రీనివా స రావు పి.యస్. సిహెచ్.రవి. పి.యస్ , బి. దుర్గా ప్రసాద్, రైతులు తదితరులు హాజరైనారు.

## క్రమపద్ధతిలో సమన్వయం చేసుకుని అభివృద్ధి పరచుకునే సంపూర్ణ సాంకేతిక పరిజ్ఞానమే యోగా

**బిజెపి నియోజకవర్గ కన్వీనర్ రంగి శెట్టి రామకృష్ణ**



పల్నాడు జిల్లా .నరసరావుపేట. జూన్ 21 (ప్రజాపాలన ప్రతినిధి)అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నరసరావుపేట పట్టణంలోని శిశుమందిర్లోలి లిబిజెపి నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గం ఆధ్వర్యంలో విద్యార్థుల చే యోగాసనాలు ప్రదర్శన మరియు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల కు బహుమతులు అందచేయటం జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బిజెపి అసెంబ్లీ కన్వీనర్ రంగిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ యోగ అంటే శారీరక వ్యాయామం,శరీరాన్ని అనేక భంగిమలలో మెలితిప్పటం అని మాత్రమే భావిస్తున్నారు కానీ యోగా అనేది ఒక విద్య అని మనలో అంతర్లీనంగా ఉన్న శక్తులను క్రమపద్ధతిలో సమన్వయం చేసుకుని అభివృద్ధి పరచుకునే సంపూర్ణ సాంకేతిక పరిజ్ఞానాన్ని యోగా అంటారని యోగా అంటే ఐక్యం అని అర్ధం అని మానవునిలోని మేధాశక్తి,ఆత్మశక్తి ల కలయికే యోగ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాకుమాను వెంకట కోటేశ్వరరావు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు వీరమల్ల వెంకటేశ్వరరావు,బీజేపీ పట్టణ కోశాధికారి కోట వెంకట సత్యనారాయణ మరియు స్వయం సేవకులు,పాఠశాల ఉఫాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## నిత్య అన్నదానం పరిశీలించిన శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవాలయం ధర్మకర్తల మండలి అధ్యక్షులు



ప్రజాపాలన న్యూస్ శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వర ఆలయంలోనీ నిత్యాన్నదానం ను శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవాలయం ధర్మకర్తల మండలి అధ్యక్షులు తారక అంజూరు శ్రీనివాసులు పరిశీలించారు. నిత్య అన్నదాన మండపానికి వెళ్లి అన్న ప్రసాదాలనులి లితనిఖీలు నిర్వహించారు. భక్తులను నాణ్యత ప్రమాణాలపై అడిగి తెలుసుకున్నారు. నిత్య అన్నదానంలోలి లివినియోగిస్తున్న సరుకులు, కూరగాయలను పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న ఉద్యోగ సిబ్బందికి తగు సూచనలులి లిచేశారు. అన్న ప్రసాదాల్లో నాణ్యత ప్రమాణాలు ఏమాత్రం తగ్గ రాదని, రుచికరమైన అన్న ప్రసాదం భక్తులకు పెట్టాలని సూచించారు. అన్నప్రసాదాలు వడ్డన లో తగు జాగ్రత్తలు తీసుకొని ప్రతి భక్తుడు తృప్తికరంగా భోజనం చేసే విధంగా చేయాలని, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలనిలి లిసూచించారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవాలయం ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ అన్ని దానాలలోకి అన్నదానం చాలా గొప్పది శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరివిగా విరాళాలు అందించాలని, తమ జన్మదినాలు ఇతర తమ కుటుంబాల్లో జరిగే సంతోషకరమైన రోజులు లో నిత్యలి లిఅన్నదానం కు విరాళంగా ఇచ్చి భగవంతుని సేవలో అన్నదానం లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. రోజు 5 నుంచి 7 వేల మందికి భోజనం, రాత్రిపూట 2500 మందికి అన్నప్రసాదాలు వితరణ చేయడం జరుగుతుందని, మరింత నాణ్యమైన అన్నప్రసాదాలు భక్తులకు అందజేశారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి సభ్యులు కొండూరు సునీత, పసాల సుమతి ప్రత్యేక ఆహ్వానిత సభ్యులు జూలకంటి సుబ్బారావు, చింతామణి పాండు, దేవస్థానం అధికారులు అన్నదాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అస్సలు ఊహించని విధంగా "సలార్".!




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటించిన లేటెస్ట్ చిత్రాల్లో ఇక నెక్స్ట్ రిలీజ్ సిద్ధంగా ఉన్న భారీ యాక్షన్ థ్రిల్లర్ సినిమానే "సలార్". మరి సలార్ ది సాగా లా ప్లాన్ చేసిన ఈ సెన్సేషనల్ ఫ్రాంచైజ్ ని అయితే దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తుండగా ఈ సినిమాపై లేటెస్ట్ గా మరికొన్ని ఇంట్రెస్టింగ్ అంశాలు బయటకి వచ్చాయి. ఈ చిత్రం కేజీయఫ్ చిత్రాలను మించి ఎన్నో రెట్లు యాక్షన్ ఎలిమెంట్స్ తో ఫిల్ అయ్యి ఉండగా హాలీవుడ్ సెన్సేషనల్ సిరీస్ గేమ్ ఆఫ్ థ్రోన్స్ టైప్ ఫీస్ట్ ని అయితే ఈ చిత్రం అందిస్తుంది అని టాక్ బయటకి వచ్చింది. ఈ చిత్రం ఖచ్చితంగా ప్రతి ఒక్కరి అంచనాలు ఊహలకు అందని విధంగా ఉండబోతుంది అని మేకర్స్ చెప్తున్నారు. అలాగే ఈ సినిమాని డార్క్ సెంట్రిక్ థీమ్ లో తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. దీనితో అయితే ఐమ్యాక్స్ వెర్షన్ లో మూవీ లవర్స్ కి అయితే నెక్స్ట్ లెవెల్ ట్రీట్ ని ఈ సినిమా అందిస్తుందని కూడా సమాచారం. మొత్తానికి అయితే ఒక పవర్ ప్యాకెడ్ ఎలిమెంట్స్ తో సలార్ ఇప్పుడు రాబోతుంది అని చెప్పాలి. ఇక ఇదెలా ఉంటుందో తెలియాలి అంటే ఈ సెప్టెంబర్ వరకు ఆగాల్సిందే.

# ఆదిపురుష్ ఎఫెక్ట్.. దేవరకి అతను ప్లస్ అవుతాడా..?

కమర్షియల్ సినిమా హిట్ లో హీరో ఎంత ముఖ్య పాత్ర పోషిస్తాడో విలన్ గా కూడా అంతే ప్రాముఖ్యత కలిగి ఉంటాడు. బలమైన హీరోకి అంతే బలమైన విలన్ పెట్టడం అన్నది కామన్. శత్రువు ఎంత బలవంతమైన వాడైతే హీరో అతని మీద గెలవాలంటే మరింత బలవంతంగా మారుతాడు. స్టార్ సినిమాల్లో ఈ విలన్ వేషాలు నెక్స్ట్ లెవెల్ లో ఉంటాయి. ఒకప్పుడు విలన్ అంటే వారు సెపరేట్ గా ఉంటారు. కానీ ఇప్పుడు విలన్ పాత్ర మరింత పండటం కోసం ఇతర భాషల్లో హీరోలని విలన్ గా ఒప్పిస్తున్నారు. తెలుగు సినిమాల్లో విలన్ పాత్రలకు కోలీవుడ్ బాలెవుడ్ నుంచి హీరోలను పాపులర్ స్టార్స్ ని దించుతున్నారు. లేటెస్ట్ గా యంగ్ టైగర్ ఎన్.టి.ఆర్ నటిస్తున్న దేవర సినిమా కోసం విలన్ గా బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీ ఖాన్ ను తీసుకున్నారు. కొరటాల శివ డైరెక్షన్ లో వస్తున్న ఈ సినిమాలో సైఫ్ విలన్ గా నటించడం ప్రాజెక్ట్ మీద స్పెషల్ క్రేజ్ ఏర్పడేలా చేసింది. ఇన్నాళ్లు



బాలీవుడ్ సినిమాలను చేసిన సైఫ్ మొదటిసారి సౌత్ సినిమా అదే తెలుగు సినిమా చేస్తున్నారు. ఆల్రెడీ ఆదిపురుష్ లో ప్రభాస్ తో స్క్రీన్ షేర్ చేసుకున్నాడు. ఆదిపురుష్ సినిమా బాలీవుడ్ డైరెక్టర్ ఓం రౌత్ తెరకెక్కించిన విషయం తెలిసిందే. ప్రభాస్ రాముడిగా రావణాసురుడిగా సైఫ్ అలీ ఖాన్ నటించిన ఆదిపురుష్ డివైడ్ టాక్ తెచ్చుకుంది. ముఖ్యంగా రావణాసురుని పాత్రని ఓం రౌత్ డిజైన్ చేసిన విధానం ఆడియన్స్ ని మెప్పించలేక పోయింది. ఇక నాసిరకం గ్రాఫిక్స్ కూడా ఆదిపురుష్ రిజల్ట్ మీద ఎఫెక్ట్ చూపించింది. అయితే ఆదిపురుష్ లో రావణాసురుడిగా నటించిన సైఫ్ ఎన్.టి.ఆర్ దేవరలో నటిస్తున్నాడు. ఆదిపురుష్ ఎఫెక్ట్ దేవర మీద ఉంటుందా అన్న డౌట్ రేజ్ అవుతుంది. ఆదిపురుష్ లో నటన పరంగా సైఫ్ ఓకే అనిపించినా అతన్ని ప్రొజెక్ట్ చేసిన విధానం లో డైరెక్టర్ ఓం రౌత్ ఫెయిల్ అయ్యాడు. సైఫ్ ని సరిగా వాడుకోలేదు దర్శకుడు. ఇక దేవర సినిమా విషయానికి వస్తే సినిమాలో సైఫ్ అలీ ఖాన్ పవర్ ఫుల్ విలన్ గా కనిపిస్తారట. ఎన్.టి.ఆర్ క్యారెక్టర్ కి ఈక్వల్ గా విలన్ పాత్రని రాసుకున్నాడట కొరటాల శివ. ఆదిపురుష్ లో సైఫ్ నటనకు దేవరలో సైఫ్ కి పూర్తిగా మార్పు ఉంటుందని. అతన్ని కొత్త యాంగిల్ లో చూపించబోతున్నారని తెలుస్తుంది. దేవరలో విలన్ గా సైఫ్ మరోసారి తన సత్తా చాటాలని చూస్తున్నారు. అయితే ఎంత చేసినా సరే ఆదిపురుష్ ఎఫెక్ట్ దేవర మీద ఉంటుందా అన్న డౌట్ అయితే ఉంది. కానీ దేవర కథ వేరు.. ఆ సినిమాలో పాత్రలు వేరు. తప్పకుండా కొరటాల శివ సైఫ్ ని నెక్స్ట్ లెవెల్ లో చూపిస్తారని చెప్పొచ్చు. దేవర సినిమాలో జాన్వి కపూర్ హీరోయిన్ గా నటిస్తుంది. సినిమాకు అనిరుద్ రవిచంద్రన్ మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమాను 2024 ఏప్రిల్ 5న రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. ఆర్.ఆర్.ఆర్ తర్వాత దేవరగా వస్తున్న తారక్ ఈ సినిమాతో పాన్ ఇండియా వైడ్ గా తన స్టామినా ఏంటో చూపించాలని ఫిక్స్ అయ్యాడు.

# పవన్ "ఓజి" షూట్ పై లేటెస్ట్ బజ్.!




ప్రస్తుతం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అయితే తన పొలిటికల్ టూర్ లో బిజీగా ఉండడంతో మళ్ళీ తాత్కాలికంగా అయితే తన సినిమాల షూట్ వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఇక ఈ చిత్రాల్లో అయితే పవన్ అమితంగా ఆసక్తి కనబరుస్తున్న సాలిడ్ యాక్షన్ ఎంటర్టైనర్ చిత్రం "ఓజి" కూడా ఒకటి. మరి పవన్ టాలెంట్ కి కరెక్ట్ సినిమా ఇది కావడంతో పవన్ ఫ్యాన్స్ కూడా ఎంతో ఎగ్జైట్ అవుతుండగా ఈ సినిమా షూట్ పై అయితే లేటెస్ట్ బజ్ ఇప్పుడు తెలుస్తుంది. ఈ సినిమాలో ఇప్పుడు పవన్ లేని పోర్షన్స్ షూటింగ్ జరుగుతున్నాయట. ప్రస్తుతం ముంబై లో ప్రీ ఇంటర్వెల్ కి సంబంధించి కొన్ని కీలక సీక్వెన్స్ లను దర్శకుడు సుజీత్ తెరకెక్కిస్తున్నాడని సమాచారం. ఇక మరికొన్ని రోజుల్లో పవన్ కూడా జాయిన్ కానున్నాడు. మరి ఈ చిత్రంలో ప్రియాంక మోహన్ హీరోయిన్ గా నటిస్తుండగా థమన్ సంగీతం అందిస్తున్నాడు. అలాగే డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

# కన్నడ సినీ ప్రేమికుల కోసం మహేష్ బాబు...!



సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పటికే ఏషియన్ సినిమాస్ తో కలిసి AMB సినిమాస్ ను హైదరాబాద్ లో ఏర్పాటు చేశాడు. గతంలో ఉన్న మల్టీప్లెక్స్ లు.. కొత్తగా వచ్చిన మల్టీప్లెక్స్ లు అన్నింటిలోకి కూడా AMB సినిమాస్ ప్రత్యేకంగా నిలవడంతో పాటు... పెద్ద సినిమాలకు కేరాఫ్ అడ్రస్ అన్నట్లుగా నిలుస్తున్న విషయం తెల్సిందే. హైదరాబాద్ కి ప్రత్యేక ఆకర్షణగా ఉండే AMB సినిమాస్ ఇప్పుడు బెంగళూరులో కూడా సినీ ప్రేమికులకు వినోదాన్ని పంచేందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం అందుతోంది. బెంగళూరులోని గాంధీ నగర్ ప్రాంతంలో కపాలి థియేటర్ ను ఏషియన్స్ సినిమాస్ తో కలిసి కొనుగోలు చేసిన మహేష్ బాబు త్వరలోనే భారీ మల్టీప్లెక్స్ ను నిర్మించబోతున్నట్లుగా తెలుస్తోంది. ఒకపాలి థియేటర్ స్థానికంగా మంచి గుర్తింపు ఉన్న థియేటర్. పురాతన థియేటర్ లను ఈ మధ్య కాలంలో రీ మోడల్ చేయడంతో పాటు కొన్ని థియేటర్లను మల్టీప్లెక్స్ లుగా మార్చుతున్నారు. అందులో భాగంగానే ఏషియన్ సినిమాస్ వారు బెంగళూరు గాంధీ నగర్ కు చెందిన కపాలి థియేటర్ ను మల్టీప్లెక్స్ గా రీ మోడల్ చేయబోతున్నారట. AMB సినిమాస్ పేరుతోనే ఈ కొత్త మల్టీప్లెక్స్ ను ఏర్పాటు చేయబోతున్నారు. ఈ భారీ మల్టీప్లెక్స్ బెంగళూరులో ఉన్న మల్టీప్లెక్స్ అన్నింటిలోకి పెద్దగా.. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించిన థియేటర్ గా నిలువబోతుంది. ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నట్లుగా కూడా సమాచారం అందుతోంది. పది స్క్రీన్ లు కలిగి ఉండే బెంగళూరు మల్టీప్లెక్స్ ను గాంధీ నగర్ లో నిర్మిస్తున్నట్లు ఏషియన్ సినిమాస్ కు చెందిన వారు పేర్కొన్నారు. అదే కాకుండా హైదరాబాద్ లోని ప్రముఖ థియేటర్ సుదర్శన్ ను కూడా ఏషియన్ సినిమాస్ వారు తీసుకుని మల్టీప్లెక్స్ గా రీ మోడల్ చేస్తున్నట్లుగా ఇటీవలే అధికారికంగా ప్రకటన చేశారు. ఈ మల్టీప్లెక్స్ లో కూడా మహేష్ బాబు పెట్టుబడి పెడుతున్నారనే వార్తలు వస్తున్నాయి. అయితే అది AMB సినిమాస్ పేరుతో ప్రారంభిస్తారా లేదా అనేది క్లారిటీ రావాల్సి ఉంది.


# రష్మిక బిగ్ మూవీ.. ఓ పనైపోయింది



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రష్మిక మందన ఈ మధ్య హిందీ లో వరుస ఆకాశాలు అందుకుంటూ స్పీడ్ పెంచుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే బాలీవుడ్ లో రెండు సినిమాలు కంప్లీట్ చేసిన ఈ బ్యూటీ రణబీర్ కపూర్ కి జోడీ గా యానిమల్ లో ప్రస్తుతం నటిస్తోంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని టి-సిరీస్ నిర్మిస్తోంది. ఇక ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం జరుగుతోంది. తాజాగా రష్మిక యానిమల్ షూటింగ్ కి సంబంధించి తన లాస్ట్ డేని కంప్లీట్ చేసింది. ఈ విషయాన్ని ఇన్ స్టాగ్రామ్ లో ఫోటోలు షేర్ చేసుకొని పంచుకుంది. రణబీర్ కపూర్ సందీప్ రెడ్డి వంగా తో పాటు మొత్తం యానిమల్ టీమ్ తో కలిసి దిగిన ఫోటోలని రష్మిక పంచుకున్నారు. ఈ ఫోటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారాయి. యానిమల్ షూటింగ్ లో నైట్ షూటింగ్ తో నా లాస్ట్ డే కంప్లీట్ చేసినట్లు రష్మిక మందన అందు లో రాసుకొచ్చింది. తనకి సంబంధించిన సీక్వెన్స్ అన్ని పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో 50 రోజుల షూటింగ్ షెడ్యూల్ ని ఫినిష్ చేసుకొని ఆమె యానిమల్ టీమ్ కి సెండాఫ్ చెప్పేసి హైదరాబాద్ తిరిగి వస్తోంది. ప్రస్తుతం సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ చేస్తోన్న పుష్ప 2 మూవీ షూటింగ్ లో ఆమె జాయిన్ కానుంది. ఈ సినిమాకి సంబంధించిన బన్నీ రష్మిక మధ్య కీలక ఎపిసోడ్స్ షూటింగ్ చేయడానికి సుకుమార్ ప్లాన్ చేస్తున్నారు. ఇక యానిమల్ సినిమాకి ప్యాకప్ చెప్పిన సందర్భంగా ఫోటోలు పంచుకోవడం తో ఆసక్తికరంగా ఆమె పోస్ట్ కూడా పెట్టారు. ఇప్పటి వరకు యానిమల్ మూవీ కోసం 50 రోజుల షూటింగ్ చేశా ను. ఈ రోజుతో నా పార్ట్ అంతా కంప్లీట్ అయ్యింది. యానిమల్ టీమ్ ని వదిలేస్తూ ఉంటే చాలా లోన్లీగా ఫీల్ అవుతున్నా. ఇన్ని రోజులు చాలా ఇష్టంగా వారి తో కలిసి పని చేశాను. టీమ్ అంతా నన్ను అద్భుతంగా రిసీవ్ చేసుకున్నారు. అందరికి నా గుండెల్లో ప్రత్యేక స్థానం ఉంటుంది. సందీప్ రెడ్డి వంగా గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. అతని మేకింగ్ విజన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. చాలా నిబద్ధతతో పని చేస్తారు. నటులకి కావాల్సినంత స్వేచ్ఛ ఇస్తారు. కచ్చితంగా యానిమల్ లో నా పాత్ర మీ అందరికి నచ్చుతుంది అంటూ రష్మిక రాసుకొచ్చారు. ఈ ఫోటోలు పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియా లో వైరల్ అవుతోంది.

# లిటిల్ మెగా ప్రిన్సెస్ పిక్ పై క్లారిటీ.!

నిన్ననే మెగా కుటుంబం ఇంట తమకి ఎంతో ప్రీతికరమైన రోజు ఆంజనేయ వారం మంగళవారం నాడు మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ తన భార్య ఉపాసన కొణిదెల లు తల్లిదండ్రులు అయ్యిన సంగతి తెలిసిందే. దీనితో అభిమానులు సహా మెగా ఫ్యామిలీ ఇంట పండుగ వాతావరణం నెలకొంది. అయితే ఈ శుభవార్తలో లిటిల్ మెగా ప్రిన్సెస్ ఆ పాపాయే అంటూ కొన్ని పిక్స్ అయితే సోషల్ మీడియాలో బాగా వైరల్ కావడం జరిగింది. మరి ఈ వైరల్ అవుతున్న పిక్ అయితే చరణ్ కూతురిది కాదని అది ఫేక్ ఫోటో మాత్రమే అందులో ఎలాంటి నిజం లేదని తెలుస్తుంది. అయితే చాలా మంది ఆ ఫోటో నే నిజం అనుకోని నమ్మారు. అయితే ఓ మంచి రోజున అవన్నీ బయటకి వస్తాయని చెప్పొచ్చు. ఇక చరణ్ అయితే ప్రస్తుతం మావెరిక్ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో "గేమ్ చేంజర్" అనే భారీ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ షూట్ లో చరణ్ త్వరలోనే పాల్గొననున్నాడు.



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ టుడే రైట్

రూపాయి పెట్టుబడి లేకుండా...
భాగస్వాములు అవ్వండి...

భారతదేశంలో ఫోర్త్ ఎస్టేట్ గా పిలవబడే మీడియా, కొన్ని వర్గాలు,కొన్ని పార్టీల చేతిలో కీలుబొమ్మగా ఉన్న విషయం విధితమే. దీని వలన, 3 ఎస్టేట్స్ అయినటువంటి పార్లమెంట్, ఎగ్జిక్యూటివ్, జ్యూడిషరీ వ్యవస్థలోని తప్పిదాలను ప్రపంచానికి తెలియపరచలేకపోతుంది. మరీ ముఖ్యంగా ఈ దేశం బాగుండాలని కోరుకునే OC లలోని అభ్యుదయ వాదులు , బీసీ, ఎస్సీ, ఎస్టీ, క్రిస్టియన్, ముస్లిం,మైనార్టీలు వారి సమస్యలు ప్రభుత్వాలకు తెలియకపోవడం వలన దేశాభివృద్ధిలో బహుజనులు పాలు పంచుకోలేక పోతున్నారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు చెప్పిన విధంగా
"పక్షికి రెక్కలు లేకపోతే ఎగురలేదు,
బహుజనులకు మీడియా లేకుంటే అభివృద్ధి లేదు"

అని చెప్పిన దాన్ని స్ఫూర్తిగా తీసుకుని ,ప్రజాపాలన తెలుగు దినపత్రిక ను మండలాల వారీగా పెట్టుబడి లేకుండా 60 % - 40% నిష్పత్తిలో పాట్నర్ షిప్ ఇస్తుంది. మీ మీ ప్రాంతం లో 100 లేదా 50 పేపర్లు చొప్పున తీసుకొని పార్ట్నర్‌గా చేరి మీ ప్రాంతంలో పత్రికాధిపతిగా ఆదాయంతో పాటు ఎనలేని గౌరవాన్ని పొందండి.

వివరాలకు ఈ క్రింది నంబర్లలో సంప్రదించండి.
8886022523,9000621111,9948725373

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16. and SREE SESHASAI ENTERPRISES "D.NO : 3-88, "C/O CHANDRA THEATER," GOSALA VILLAGE, "MAIN ROAD, PENAMALURU MANDAL, KRISHNA DT, ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com